ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

**పాత్రికేయులు కావలెను**

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న రిపబ్లిక్ తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -1 | పేజీలు - 8 వెల - 03/- | శనివారం 25 ఏప్రిల్ 2026



## ఈడీ మెరుపు దాడులు..

**ఏపీ లిక్కర్ స్కామ్‌లో కీలక నిందితుల ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు**

**మద్యం కుంభకోణంలో మనీ లాండరింగ్ కోణాన్ని విచారిస్తున్న ఈడీ**

**చెవిరెడ్డి, ధనుంజయరెడ్డి, రాజ్ కెసిరెడ్డి తదితరుల నివాసాల్లో సోదాలు**

**లిక్కర్ స్కామ్ లో వీరంతా కీలక పాత్ర పోషించినట్టు ఇప్పటికే గుర్తించిన సిట్**

**అమరావతి, ఏప్రిల్ 24, (రిపబ్లిక్ న్యూస్):-** ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను కుదిపేస్తున్న లిక్కర్ స్కామ్ కేసులో నేడు మరో కీలక సన్నివేశం చోటు చేసుకుంది. వేల కోట్ల రూపాయల మద్యం కుంభకోణంలో మనీ లాండరింగ్ కోణాన్ని విచారిస్తున్న ఈడీ అధికారులు... కేసులోని ఐదుగురు కీలక వ్యక్తుల నివాసాలు, కార్యాలయాల్లో ఏకకాలంలో సోదాలు చేపట్టారు. **మిగతా 2లో...**

# రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యం

### వ్యవసాయ రంగంపై ఉన్నతస్థాయి సమీక్ష



**ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు పీఎండీఎస్ విధానం అమలు**

**రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని సీఎం ఆదేశం**

**రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు ప్రణాళిక**

**సాంకేతికత వినియోగంతో రైతులకు మెరుగైన సేవలు**

**ఈ ఏడాది 11 లక్షల హెక్టార్లలో ప్రకృతి సేద్యం లక్ష్యం**

**అమరావతి, ఏప్రిల్ 24, (రిపబ్లిక్ న్యూస్):-** రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావం చూపే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలో, దానిని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం పటిష్టమైన ముందస్తు చర్యలు చేపట్టింది. వ్యవసాయ రంగంపై ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం జరిపిన ఉన్నతస్థాయి సమీక్షలో ఈ అంశంపై ప్రధానంగా చర్చించారు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల వల్ల సగటు వర్షపాతం 92 శాతానికే పరిమితం కావచ్చని అధికారులు**మిగతా 2లో...**



## అధికారి అహంకారానికి దళిత కార్మికుడి బలి




8లో.

## మహిళా బిల్లును అడ్డుకున్నారు...

### ఇండియా కూటమిపై రాష్ట్రవ్యాప్త నిరసనలకు సీఎం చంద్రబాబు పిలుపు


**ఈ నెల 30లోగా రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో ఆందోళనలు చేయాలని ఆదేశం**

**'స్త్రీ శక్తి' పేరుతో సదస్సులు నిర్వహించి వాస్తవాలు వివరించాలని సూచన**

**డీలిమిటేషన్ సాకుతో కాంగ్రెస్, టీఎంసీ, డీఎంకే బిల్లును అడ్డుకున్నాయని ఆరోపణ**

**ఎన్డీఏ మహిళా పక్షపాతి అని.. ఇండియా కూటమి మహిళా వ్యతిరేకి అని వ్యాఖ్య**

**అమరావతి, ఏప్రిల్ 24, (రిపబ్లిక్ న్యూస్):-** పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లును ఇండియా కూటమి పక్షాలు అడ్డుకున్నాయని ఆరోపిస్తూ రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సీఎం చంద్రబాబు ఎన్డీఏ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇవాళ ఆయన ఎన్డీఏ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్,**మిగతా 2లో...**





## బీజేపీలోకి రాఘవ్ చద్దా

**ఆమ్ ఆద్మీ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ..**

**మూడింట రెండొంతుల మంది ఆప్ రాజ్యసభ ఎంపీలతో కలిసి బీజేపీలో విలీనం!**

**పార్టీ తన ఆశయాలకు దూరమైందంటూ చద్దా విమర్శలు**

**రాజ్యసభ ఉపనేత పదవి నుంచి తొలగింపే కారణమని ప్రచారం**

**ఢిల్లీ, ఏప్రిల్ 24, (రిపబ్లిక్ న్యూస్):-** ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కి భారీ రాజకీయ ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరు, కీలక నేత, రాజ్యసభ సభ్యుడు రాఘవ్ చద్దా బీజేపీలో చేరనున్నట్లు సంచలన ప్రకటన చేశారు. **2లో...**

## డ్రైవర్ హత్య కేసులో వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు అరెస్ట్

**రాజమండ్రి కోర్టు బయట అనంతబాబును అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**బెయిల్ రద్దు పిటిషన్ విచారణకు హాజరైన సమయంలో ఘటన**

**గత నాలుగేళ్లుగా ఈ కేసు విచారణలో పలు మలుపులు**

**అమరావతి, ఏప్రిల్ 24, (రిపబ్లిక్ న్యూస్):-** దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో నిందితుడిగా ఉన్న వైసీపీ ఎమ్మెల్సీ అనంత ఉదయ్ భాస్కర్ (అనంతబాబు)ను పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం నాడు**మిగతా 2లో...**



## కృష్ణా తీరాన సింగపూర్ మెరుపులు...

**మెరీనా బ్యారేజీని పరిశీలించిన ఏపీ మంత్రులు**

**సింగపూర్ పర్యటనలో మెరీనా బ్యారేజీని సందర్శించిన ఏపీ మంత్రుల బృందం**

**వరద నియంత్రణ, నీటి సంరక్షణ విధానాలపై అధ్యయనం**

**అమరావతి, ఏప్రిల్ 24, (రిపబ్లిక్ న్యూస్):-** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని ఆధునిక హంగులతో అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా సింగపూర్ పర్యటనలో ఉన్న ఏపీ మంత్రుల బృందం, అక్కడి ప్రసిద్ధ మెరీనా బ్యారేజీని సందర్శించి అధ్యయనం చేసింది. వరద నియంత్రణ, నీటి సరఫరా, పర్యాటకాన్ని ఒకేచోట మేళవించిన **మిగతా 2లో...**





## హుగ్లీ నదిలో ప్రధాని విహారం

**బెంగాలీల్లో గంగానదికి ప్రత్యేకత ఉంది ఎక్స్ వేదికగా ఫోటోలు పంచుకున్న మోడీ**

**కోల్‌కతా, ఏప్రిల్ 24, (రిపబ్లిక్ న్యూస్):-** ప్రధాని నరేంద్ర మోదీ పశ్చిమ బెంగాల్లో పర్యటిస్తున్నారు. శుక్రవారం కోల్‌కతాలోని హుగ్లీ నదిలో బోట్ రైడ్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా కెమెరాను చేతపట్టి నది అందాలను క్లిక్‌మనిపించారు. దీనికి సంబంధించిన ఫోటోలను ఆయన ఎక్స్‌లో పంచుకున్నారు. హుగ్లీ నది బెంగాల్ సంస్కృతితో ముడిపడి ఉందని మోదీ పేర్కొన్నారు. **మిగతా 2లో...**

## ఆర్టీసీ సమ్మెకు బలయిన శంకర్‌గౌడ్

**పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం**

**చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో మృతి**

**సీఎం రేవంత్‌మంత్రి పొన్నం సంతాపం**



**హైదరాబాద్,, ఏప్రిల్ 24, (రిపబ్లిక్ న్యూస్):-** ఆర్టీసీ సమ్మెపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ నర్సంపేట డిపో ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి చెందారు. హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. అపోలో ఆస్పత్రిలో శంకర్ గౌడ్ మృతదేహానికి పోస్టుమార్టం పూర్తైంది. **మిగతాది 2లో...**

## ప్రభుత్వంతో ఆర్టీసీ జేఏసీ చర్చలు ఫలప్రదం..



**తెలంగాణలో రోడ్డెక్కనున్న బస్సులు!**

**సమ్మె విరమించేందుకు కార్మిక సంఘాల అంగీకారం**

**శనివారం ఉదయం నుంచి యథావిధిగా బస్సు సర్వీసులు**

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన భేటీ**

**అధికారికంగా వెలువడనున్న ప్రకటన**

**హైదరాబాద్,, ఏప్రిల్ 24, (రిపబ్లిక్ న్యూస్):-** తెలంగాణలో కొనసాగుతున్న ఆర్టీసీ సమ్మెకు తెరపడనుంది. ప్రభుత్వంతో ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) నేతలు జరిపిన చర్చలు ఫలప్రదంగా ముగిశాయి**2లో...**

# బీజేపీలోకి రాఘవ్ చద్దా

**మొదటిపేజీ తరువాయి**

తనతో పాటు మూడింట రెండొంతుల మంది ఆప్ రాజ్యసభ సభ్యులు కూడా బీజేపీలో విలీనం కానున్నారని చెప్పడం సంచలనం సృష్టించింది. ఈరోజు ఢిల్లీలో సీనియర్ ఎంపీలు అశోక్ మిట్టల్, సందీప్ పాఠక్‌లతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాఘవ్ చద్దా ఈ ప్రకటన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “15 ఏళ్లుగా ఆప్‌కు అంకితభావంతో పనిచేశాను. కానీ ఒకప్పుడు అవినీతి నిర్మూలన నినాదంతో అధికారంలోకి వచ్చిన పార్టీ ఇప్పుడు నిజాయతీ రాజకీయాలకు దూరమైంది. నేను సరైన వ్యక్తినే, కానీ తప్పుడు పార్టీలో ఉన్నాను. అందుకే పార్టీకి దూరమై ప్రజలకు దగ్గరవుతున్నాను“ అని వ్యాఖ్యానించారు. ఆప్‌కు రాజ్యసభలో మొత్తం 10 మంది సభ్యులు ఉండగా, వారిలో మూడింట రెండొంతుల మంది తనతో పాటు బీజేపీ వైపు వస్తున్నారని చద్దా పేర్కొన్నారు. వీరిలో ప్రముఖ క్రీడాకారుడు హర్భజన్ సింగ్, స్వాతి మాలివాల్ వంటి వారు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. గత కొంతకాలంగా పార్టీలో రాఘవ్ చద్దా అసంతృప్తితో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవల ఆయన్ను రాజ్యసభలో ఆప్ ఉప నాయకుడి పదవి నుంచి తొలగించి, ఆ స్థానంలో అశోక్ మిట్టల్‌ను నియమించారు. ఈ పరిణామం పార్టీ అంతర్గత విభేదాలను బహిర్గతం చేసింది. ఈ నేపథ్యంలోనే చద్దా ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇప్పటికే పలు సవాళ్లను ఎదుర్కొంటున్న కేజ్రీవాల్ నాయకత్వానికి ఈ పరిణామం మరింత ఇబ్బందికరంగా మారింది.ం

## డ్రైవర్ హత్య కేసులో వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు అరెస్ట్

**మొదటిపేజీ తరువాయి**



రాజమండ్రి కోర్టులో బెయిల్ రద్దు పిటిషన్‌పై విచారణకు హాజరైన ఆయన, కోర్టు నుంచి బయటకు వచ్చిన వెంటనే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడిని కాకినాడలోని సర్పవరం పోలీస్ స్టేషన్‌కు తరలిస్తారని తెలుస్తోంది. గత నాలుగేళ్లుగా డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసు విచారణలో పలు కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ కేసులో అనంతబాబు ప్రధాన నిందితుడుగా (ఏ-1), ఆయన భార్య లక్ష్మీదుర్గ ఏ-2గా ఉన్నారు. ఇటీవల రాజమండ్రి ప్రత్యేక కోర్టులో అనంతబాబుకు గతంలో మంజూరైన బెయిల్‌ను రద్దు చేయాలని పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ నిమిత్తం ఆయన తన భార్యతో కలిసి కోర్టుకు హాజరయ్యారు. అనంతబాబు అరెస్టు నేపథ్యంలో పోలీసులు రాజమండ్రి కోర్టు సముదాయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ఈ అరెస్టుతో కేసు విచారణ మరోసారి వేగవంతం కానుందని భావిస్తున్నారు.

## కృష్ణా తీరాన సింగపూర్ మెరుపులు...

**మొదటిపేజీ తరువాయి**

ఈ బృహత్తర ప్రాజెక్టు నిర్మాణ శైలిని, నిర్వహణ విధానాలను మంత్రులు క్షుణ్ణంగా పరిశీలించారు. తమ సింగపూర్ పర్యటనలో నాలుగో రోజు హోంమంత్రి వంగలపూడి అనిత, మంత్రులు అచ్చెన్నాయుడు, బీసీ జనార్దన్ రెడ్డి, సత్యకుమార్ యాదవ్, అనగాని సత్యప్రసాద్ తదితరులు మెరీనా బ్యారేజీని సందర్శించారు. పర్యావరణానికి హాని కలగకుండా నీటి సమస్యలను అధిగమించడం, గ్రీన్ రూఫ్ వంటి కట్టడాలతో దీనిని ఒక పర్యాటక కేంద్రంగా ఎలా తీర్చిదిద్దారనే విషయాలను నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్ సిటీస్ డైరెక్టర్ ఖూ టెంగ్ చై మంత్రుల బృందానికి వివరించారు. ఈ పర్యటన అనంతరం హోంమంత్రి అనిత స్పందిస్తూ, మెరీనా బ్యారేజ్ ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉందని తెలిపారు. అమరావతి రాజధాని ప్రాంతంలో, కృష్ణా నది తీరాన కూడా ఇటువంటి ఆధునిక అభివృద్ధి నమూనాలను అమలు చేసే అవకాశాలపై తమ బృందం చర్చించినట్లు వెల్లడించారు.

## ఆర్టీసీ సమ్మెకు బలయిన శంకర్‌గౌడ్

**(మొదటి పేజి తరువాయి)**

బంధువులకు శంకర్ గౌడ్ మృతదేహాన్ని అప్పగించారు. స్వస్థలానికి శంకర్ గౌడ్ మృతదేహం తరలించారు. గురువారం ఆర్టీసీ డ్రైవర్ పెట్రోల్ పోసుకొని నిప్పంటిచుకున్న విషయం తెలిసిందే. గత రెండ్రోజులుగా ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగిన విషయం తెలిసిందే. ఈ సమ్మెలో భాగంగా గురువారం రాష్ట్రంలోని అనేక చోట్ల కార్మికులు నిరసనలు చేపట్టారు. ఈ క్రమంలోనే వరంగల్ జిల్లా నర్సంపేట ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సమ్మెలో పాల్గొన్న శంకర్‌గౌడ్(55) పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆయనను వెంటనే వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అప్పటికే 80 శాతం కాలినగాయాలు కావడంతో హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందారు. అత్యక్రియలకు ప్రముఖ రాజయకీయ నాయకులు హాజరుకానున్నారు. మరోవైపు.. ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ బలవన్మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శంకర్ గౌడ్ కుటుంబానికి అండగా ఉంటామని, ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా ఆదుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. శంకర్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ధైర్యం, మనోబలం కలగాలని ప్రార్థించారు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం ఆ కుటుంబాన్ని దు:ఖసాగరంలో ముంచిందని తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికులతో ప్రభుత్వం చర్చలు జరుపుతుందని, వారి సమస్యలను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నాలు చేస్తుందని గుర్తు చేశారు. ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. శంకర్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. ఆర్టీసీ కార్మికులు ఆందోళన చెందవద్దని క్షణికావేశంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు.

## హుగ్లీ నదిలో ప్రధాని విహారం

**(మొదటి పేజి తరువాయి)**

గడిపినట్లు వెల్లడించారు. ఈ క్రమంలో నదిలో పడవ నడిపేవారితో పాటు, ఉదయపు నడకకు వచ్చిన వారితో కాసేపు ముచ్చటించినట్లు తెలిపారు. పడవ నడిపేవారి శ్రామిక శక్తిని ఈసందర్భంగా మోదీ కొనియాడారు. ఎన్నికల్లో గెలిపిస్తే.. పశ్చిమ బెంగాల్ అభివృద్ధికి, ప్రజల శ్రేయస్సు కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. హుగ్లీ నది ఒడ్డున తాను వెచ్చించిన సమయం చాలా ప్రత్యేకమైనదని మోదీ మరో పోస్టులో పేర్కొన్నారు. చరిత్రాత్మక విద్యాసాగర సేతు, హౌడా వంతెనను దగ్గరగా చూడటం ఆనందంగా ఉందన్నారు.

## ఏడుగురు ఐపిఎస్‌ల బదిలీలు

### హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా శిఖాగోయల్

### ఫ్యూచర్ సిటీ కమిషనర్‌గా తరుణ్ జోషి

**హైదరాబాద్,ఏప్రిల్24(ఆర్ఎన్ఎ):**

రాష్ట్రంలో ఏడుగురు సీనియర్ ఐపీఎస్‌లు బదిలీ అయ్యారు. ఈ మేరకు సీఎస్ రామకృష్ణా రావు ఉత్తర్వులు జారీ చేశారు. హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా శిఖాగోయల్ నియమితులయ్యారు. విజిలెన్స్ డీజీగా డీఎస్ చౌహాన్ బదిలీ అయ్యారు. మల్టిజోన్ 2 ఐజీగా షానవాజ్ ఖాసిం నియిమితులయ్యారు. ఆయన పోలీసు పర్సనల్ ఐజీగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు. ఫ్యూచర్ సిటీ కమిషనర్‌గా తరుణ్ జోషి నియమితులయ్యారు. డ్రగ్స్ కంట్రోల్ డీజీగా అవినాష్ మొహంతిని నియమిస్తూ, ఆయనకు ఏసీబీ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇకపోతే మల్కాజిగిరి పోలీసు కమిషనర్‌గా బి.సుమతి, ఐజీ కార్తికేయకు ఎస్ఐబీ ఐజీగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

# మహిళా బిల్లును అడ్డుకున్నారు...

**మొదటిపేజీ తరువాయి**

జనసేన నుంచి మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా పాల్గొన్నారు. మహిళలకు అన్యాయం చేసిన పార్టీల వైఖరిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ నెల 30వ తేదీలోగా రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో నిరసనలు, ఆందోళనలు చేపట్టాలని చంద్రబాబు ఆదేశించారు. ఇండియా కూటమి తీరును నిరసిస్తూ ‘స్త్రీ శక్తి’ పేరుతో సదస్సులు నిర్వహించాలని సూచించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పూర్తి సమన్వయంతో ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. “మహిళా రిజర్వేషన్లను అడ్డుకుని ఇండియా కూటమి పార్టీలు మహిళలకు తీవ్ర అన్యాయం చేశాయి. కాంగ్రెస్, టీఎంసీ, డీఎంకే పార్టీలకు ఒక్క మహిళ కూడా ఓటు వేయకూడదు. ఎన్డీఏ మహిళా పక్షపాతి అయితే, ఇండియా కూటమి మహిళా వ్యతిరేకి“ అని వ్యాఖ్యానించారు. మహిళా బిల్లును కాంగ్రెస్ పార్టీ 1996 నుంచి అడ్డుకుంటూనే ఉందని చంద్రబాబు విమర్శించారు. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు రాజ్యసభలో బిల్లు పెడితే బీజేపీ మద్దతిచ్చిందని, కానీ లోక్‌సభలో మాత్రం కాంగ్రెస్ ఆ బిల్లును ప్రవేశపెట్టలేదని గుర్తుచేశారు. ఇప్పుడు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో బిల్లు తీసుకొస్తే, డీలిమిటేషన్ అనే సాకు చూపి దానిని వీగిపోయేలా చేశారని ఆరోపించారు.

డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదని, ఏ రాష్ట్రానికీ ఇబ్బంది రానివ్వబోమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టమైన హామీ ఇచ్చారని చంద్రబాబు తెలిపారు. అవసరమైతే బిల్లులో మార్పులు చేస్తామని చెప్పినా, మహిళా బిల్లును అడ్డుకోవాలనే దురుద్దేశంతోనే ఇండియా కూటమి పార్టీలు డీలిమిటేషన్ అంశాన్ని తెరపైకి తెచ్చాయని విమర్శించారు. దేశంలోనే తొలిసారిగా స్వర్గీయ ఎన్టీఆర్ మహిళా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశారని, స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించింది కూడా తమ ప్రభుత్వమేనని చంద్రబాబు గుర్తుచేశారు.

# రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి**

సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా రాయలసీమలోని అనంతపురం, సత్యసాయి, కడప, కర్నూలుతో పాటు ప్రకాశం జిల్లాలో వర్షాభావ పరిస్థితులు తలెత్తవచ్చని, ఇది పప్పుధాన్యాలు, నూనెగింజలు, ఉద్యాన పంటలపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ సవాలును అధిగమించేందుకు ‘ప్రీ-మాన్‌సూన్ డ్రై సోయింగ్’ (పీఎండీఎస్) విధానాన్ని ఒక అస్త్రంగా ప్రయోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వర్షాలు కురవకముందే విత్తనాలు నాటే ఈ పద్ధతి ద్వారా రైతులకు పెట్టుబడి ఖర్చు, ఎరువులు, నీటి వినియోగం తగ్గుతుందని అధికారులు వివరించారు. తద్వారా ఎకరాకు రూ.5,000 నుంచి రూ.7,000 వరకు అదనపు ఆదాయం వస్తుందని తెలిపారు. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల ఎకరాల్లో పీఎండీఎస్ విధానాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రి లక్ష్యంగా నిర్దేశించారు.

### వ్యవసాయంలో సమూల మార్పులే లక్ష్యం

రైతుకు సాగు భద్రత కల్పించి, అధిక ఆదాయం సాధించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఏడాదంతా పొలం పచ్చగా ఉండేలా, భూమిని భాగాలుగా విభజించి ఒకే రైతు బహుళ పంటలు సాగు చేసేలా ప్రోత్సహించాలని సూచించారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటల వైపు రైతులను మళ్లించాలని, వాటి వల్ల కలిగే లాభాలను వివరించి చెప్పాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రైతు బజార్ల నుంచి నేరుగా ఇంటికే సరుకులు డెలివరీ చేసే వ్యవస్థను ఏర్పాటు చేయాలని, అవసరమైతే ఏజెన్సీల సేవలు వినియోగించుకోవాలని ఆదేశించారు.

### హార్టికల్చర్ హబ్.. ప్రత్యేక పంటలపై దృష్టి

రాష్ట్రంలో ఉద్యానవన రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. మొత్తం 50 లక్షల ఎకరాల్లో హార్టికల్చర్ సాగు చేపట్టేలా కార్యాచరణ సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. ముఖ్యంగా రాయలసీమను ‘గ్లోబల్ హార్టికల్చర్ హబ్’గా తీర్చిదిద్దేందుకు క్లస్టర్ల వారీగా అభివృద్ధి ప్రణాళికలు చేపట్టాలన్నారు. ఇందులో భాగంగా ప్రపంచంలోనే తొలిసారిగా 250 ఎకరాల్లో ‘కోకో సిటీ’ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఇది ఔత్సాహిక రైతులకు ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌గా ఉపయోగపడాలని సూచించారు.

అరకులో కుంకుమ పువ్వు, అనంతపురంలో యాపిల్ సాగును ప్రోత్సహించడంతో పాటు అవకాడో, అంజీర్, పనస, మిరియాల సాగును విస్తరించాలని నిర్దేశించారు. అంజీర్ వంటి పండ్లను డ్రైఫ్రూట్స్‌గా మార్చి విలువ పెంచేలా చూడాలన్నారు. ‘ఏపీ మష్రూమ్ మిషన్ 2026-31’ కింద ఏటా లక్ష మెట్రిక్ టన్నుల దిగుబడి సాధించాలని లక్ష్యం నిర్దేశించారు.

### ప్రకృతి సాగుకు పెద్దపీట

రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయాన్ని అన్ని గ్రామాలకు విస్తరించాలని ముఖ్యమంత్రి భారీ లక్ష్యాన్ని నిర్దేశించారు. 2025-26లో 9.26 లక్షల హెక్టార్లలో ప్రకృతి సేద్యం జరగగా, ఈ ఏడాది (2026-27) ఏకంగా 11 లక్షల హెక్టార్లకు పెంచాలని ఆదేశించారు. రాష్ట్రంలోని 13,300 గ్రామ పంచాయతీల్లో 25 లక్షల మంది రైతులను ఇందులో భాగస్వాములను చేయాలన్నారు. ప్రకృతి సాగు ఉత్పత్తులకు సరైన సర్టిఫికేషన్ అందించి, అధిక ధరకు అమ్ముకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

### సాంకేతికతతో రైతుకు భరోసా

వ్యవసాయంలో ఆధునిక సాంకేతికత వినియోగంపై సీఎం దృష్టి సారించారు. ‘ఫార్మర్ యాప్’లో ఇప్పటివరకు 8 లక్షల మంది రైతులు నమోదు చేసుకున్నారని అధికారులు తెలుపగా, రిజిస్ట్రేషన్‌తో పాటు ఎంతమంది రైతులు దానిని వినియోగించి లబ్ధి పొందుతున్నారనేదే ముఖ్యమని సీఎం అన్నారు. ఈ యాప్ ద్వారా పంటల వివరాలు, భూసార పరీక్షలు, వాతావరణ సమాచారం, ప్రభుత్వ పథకాలు వంటివి రైతులకు అందుబాటులో ఉంటాయి. అదేవిధంగా, రైతు భరోసా కేంద్రాల పనితీరును పర్యవేక్షించేందుకు రూపొందించిన ‘ఆర్ఎస్కే ఇంటిలిజెన్స్ హబ్ డ్యాష్‌బోర్డ్’లో సమాచారం ఎప్పటికప్పుడు కచ్చితంగా ఉండేలా చూడాలని స్పష్టం చేశారు.

# ఈడీ మెరుపు దాడులు..

**మొదటిపేజీ తరువాయి**

సోదాలు ఎవరి నివాసాల పైన?
చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి: వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే
కృష్ణమోహన్ రెడ్డి: మాజీ సీఎం జగన్ ఓఎస్డీ
ధనుంజయరెడ్డి: విశ్రాంత ఐఏఎస్ అధికారి
బాలాజీ గోవిందప్ప: భారతీ సిమెంట్స్ డైరెక్టర్
రాజ్ కెసిరెడ్డి: లిక్కర్ స్కామ్‌లో ప్రధాన నిందితుడు.

గత ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంలో వీరంతా కీలక పాత్ర పోషించారని సిట్ ఇప్పటికే నిర్ధారించింది. అక్రమంగా సంపాదించిన ఆస్తులు, నగదు మళ్లింపునకు సంబంధించిన పక్కా ఆధారాల కోసమే ఈడీ ఈ ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కాం కేసులో భాగంగా మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి నివాసంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నిర్వహించిన సోదాలు ముగిశాయి. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఉన్న ఆయన ఇంట్లో శుక్రవారం ఉదయం ప్రారంభమైన తనిఖీలు సుమారు 13 గంటల పాటు కొనసాగి సాయంత్రం వేళకు ముగిశాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో (2019-2024) మద్యం విధానంలో వేల కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని ఈడీ అనుమానిస్తోంది. డిజిటల్ చెల్లింపులను నిరుత్సాహపరిచి, కేవలం నగదు లావాదేవీల ద్వారా వచ్చిన సొమ్మును షెల్ కంపెనీలకు మళ్లించి మనీలాండరింగ్‌కు పాల్పడ్డారని ప్రధాన ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ఈడీ దర్యాప్తు ముమ్మరం చేసింది. సోదాల సమయంలో ఇంట్లోనే ఉన్న విజయసాయి రెడ్డిని అధికారులు మద్యం పాలసీ రూపకల్పన, ఆర్థిక లావాదేవీలపై ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఆయన ఇంట్లోని పలు కీలక పత్రాలతో పాటు ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్ హార్డ్ డిస్క్‌లు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. వీటిలోని డేటాను విశ్లేషించడం ద్వారా ఈ కేసులో కీలక ఆధారాలు లభిస్తాయని ఈడీ భావిస్తోంది.

ఈ కేసులోని ఇతర నిందితుల ఇళ్లలో కూడా ఈడీ సోదాలు చేపట్టింది. ఈ సోదాలు రాజకీయ కక్ష సాధింపులో భాగమేనని వైసీపీ ఆరోపిస్తుండగా, ప్రభుత్వ ధనాన్ని దోచుకున్న వారిని వదిలిపెట్టవద్దని అధికార కూటమి నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఈ కేసులో లభించే ఆధారాలను బట్టి మరికొందరు కీలక నేతలకు కూడా నోటీసులు జారీ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

# ప్రభుత్వంతో ఆర్టీసీ జేఏసీ చర్చలు ఫలప్రదం..

**మొదటిపేజీ తరువాయి**

దీంతో సమ్మెను విరమిస్తున్నట్లు జేఏసీ నేతలు అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే, శనివారం ఉదయం మొదటి షిఫ్ట్ నుంచే ఆర్టీసీ బస్సులు రోడ్డెక్కనున్నాయి. శుక్రవారం సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రుల బృందం ఆర్టీసీ జేఏసీ నేతలతో సమావేశమైంది. ఈ భేటీలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, వివేక్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు, ఉపాధ్యాయుల వేతనాలు, పెన్షన్లు, ఇతర ప్రధాన డిమాండ్లపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు.

జేఏసీ నేతలు ప్రస్తావించిన అంశాలపై మంత్రుల బృందం సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ హామీతో జేఏసీ నేతలు సంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ సానుకూల పరిణామంతో ఆర్టీసీ సేవలు తిరిగి సాధారణ స్థితికి రావడానికి మార్గం సుగమమైంది. సమ్మె విరమణ వార్తతో ప్రయాణికులు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. వరంగల్ జిల్లా నర్సంపేట డిపోకు చెందిన డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి పట్ల మంత్రులు, జేఏసీ నేతలు సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని మంత్రులు భరోసా ఇచ్చారు. ఏ కార్మికుడు కూడా ఆవేశంతో అనాలోచిత నిర్ణయం తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలన్నింటిని తక్షణమే అమలు చేయాలని జేఏసీ నేతలు పట్టుబట్టారు.

కార్మికులు లేవనెత్తిన 32 డిమాండ్లలో 29 అంశాలకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రులు తెలిపారు. మిగిలిన మూడు అంశాలపై అధ్యయనం కోసం కొంత సమయం కావాలని అన్నారు. అయితే ఏయే డిమాండ్లు ఎప్పటిలోగా అమలు చేస్తారో లిఖితపూర్వక హామీ ఇవ్వాలని జేఏసీ నేతలు డిమాండ్ చేశారు.

### శంకర్ గౌడ్ కుటుంబానికి రూ.10 లక్షలు, ఉద్యోగం

ఆత్మహత్య చేసుకున్న డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల పరిహారం ప్రకటించింది. స్థానిక ఆర్డీవో ఉమారాణి ఆయన మృతదేహానికి ఈరోజు నివాళులర్పించారు. అనంతరం ఈ ప్రకటన చేశారు. పరిహారంతో పాటు కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఆర్టీసీలో ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. మరోవైపు, నర్సంపేట కాంగ్రెస్ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి వ్యక్తిగతంగా రూ.5 లక్షల ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు ప్రకటించారు.

# కర్నూలులో పెట్రోల్ బంకులు మూత

**కర్నూలు ఏప్రిల్ 24, (రిపబ్లిక్ న్యూస్):-**

పెట్రోల్, డీజిల్ సరఫరా విషయంలో సమస్య తలెత్తింది. ఆయిల్ కంపెనీల నుంచి పెట్రోల్ బంకులకు సరఫరాలో కోతలు విధించడంతో రాష్ట్ర వ్యాప్తంగా బంక్ యజమానుల్లో ఆందోళన నెలకొంది. సరఫరా తగ్గిపోవడంతో డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థపై ఒత్తిడి పెరుగుతోంది. కర్నూలు జిల్లాలో మొత్తం 166 ఫిల్లింగ్ స్టేషన్లు ఉన్నాయి. అందులో హెచ్‌పి 58, ఐఒసిఎల్ 52, బిపిసిఎల్ 30, ప్రయివేట్ నయారా 22, జియో కంపెనీవి నాలుగు ఉన్నాయి. జిల్లాలో శుక్రవారం నాటికి 66కు పైగా పెట్రోల్ బంకులు పూర్తిగా మూతపడ్డాయి. దీంతో తెల్లవారుజాము నుంచే వాహనదారులు బంకుల వద్ద బారులు తీరారు. లీటర్ పెట్రోల్ కోసం కిలోమీటర్ల మేర క్యూలైన్లలో వేచి ఉన్నారు. పెట్రోల్ బంక్ వద్ద స్టాక్ లేదని చెప్పడంతో, వాహనదారులు ఆశగా మరో బంక్ వైపు పరుగులు తీస్తున్నారు. తీరా అక్కడికి వెళ్లేసరికి పరిమితంగానే సరఫరా చేస్తున్నామని చెప్పడంతో వాహనదారులు నిరాశకు గురవుతున్నారు. ఆర్థిక సంవత్సరం బకాయిలను చెల్లిస్తేనే పెట్రోల్ సరఫరా చేస్తామని కంపెనీలు చెబుతున్నట్లు సమాచారం. ఎన్‌టిఆర్ జిల్లా నందిగామ నియోజకవర్గంలో సుమారు 25కు పైగా ఆయిల్ బంకులు ఉన్నాయి. ఈ నెల 23 నుంచి మూడు రోజులుగా బంకుల్లో డీజిల్, పెట్రోల్ నో స్టాకు బోర్డులు పెడుతున్నారు. మఖ్యంగా డీజిల్‌కు బాగా కొరత ఏర్పడింది. ఏ బంకుకు వెళ్లినా డీజిల్ స్టాకు లేదని చెబుతున్నారు. డిపోల నుండి సరిపడా స్టాకు రావటం లేదని డీలర్లు చెబుతున్నారు.



ప్రజా రిపబ్లిక్



## కర్నూలు జిల్లా వడియరాజుల క్యాలెండర్ విడుదల



**పాములపాడు ఏప్రిల్ 24; రిపబ్లిక్ న్యూస్; -** అఖిలభారత శ్రీశైల క్షేత్రం ఒడియా రాజుల నిత్య అన్నదాన సత్రంలో కర్నూలు జిల్లా వడియరాజుల సంక్షేమ సంఘం 2026 క్యాలెండర్ను సత్రం చైర్మన్ జలిపిటి రాములు, జాతీయ బీసీల కార్యదర్శి డాక్టర్ బత్తుల సంజీవరాయుడు, మక్కల శ్రీనివాసులు జిల్లా కార్యదర్శి వి. వెంకటేశ్వర్లు తదితర వడ్డెర నాయకులు క్యాలెండర్ ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ జరిపిటి రాములు మాట్లాడుతూ తెలంగాణ , ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో ఉన్న ఒడియా రాజులు ఐకమత్యంగా ఉంటూ ఆర్థిక, రాజకీయ ,సామాజికంగా ఎదుగుదలకు కృషి చేయాలని కోరారు . ఈ సందర్భంగా బత్తుల సంజీవరాయుడు , మక్కల శ్రీనివాసులు మాట్లాడుతూ తమ పిల్లలను బాగా చదివించుకోవాలని , ఆర్థిక సమగ్ర ఎదుగుదలకు, రాజకీయంగా ముందుకెళ్లాలని, సామాజిక పురోభివృద్ధికి అంకితభావంతో పని చేయాలన్నారు , ఈ కార్యక్రమంలో పలువురు వడ్డెర సంఘ నాయకులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి ఫుట్ బాల్ టోర్నీ ప్రారంభం

### జేసి సి.విష్ణు చరణ్

**అనంతపురము స్పోర్ట్స్, ఏప్రిల్ 24,(రిపబ్లిక్ న్యూస్ ):**
రాష్ట్రస్థాయి శాప్ లీగ్ ఫుట్ బాల్ టోర్నమెంట్ 2026ను ఈనెల ఏప్రిల్ 28 నుండి 30 వరకు అనంతపురం జిల్లా కేంద్రంలో ఆర్డిటి స్టేడియం నందు నిర్వహించనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులను జిల్లా సంయుక్త కలెక్టర్ సి. విష్ణు చరణ్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు రాష్ట్ర స్థాయి శాప్ లీగ్ ఫుట్బాల్ టోర్నమెంట్ 2026 నిర్వహణపై అధికారులతో జాయింట్ కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు.

**ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలి**

ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఈ ఫుట్ బాల్ క్రీడా పోటీలలో అండర్ 15, అండర్ 21 బాలురు, బాలికలకు పోటీలు నిర్వహిస్తారని, సుమారు 2000 మంది క్రీడాకారులు పాల్గొంటారని, ఇందులో 28 జిల్లాల నుండి ప్రాతినిధ్యం ఉంటుందని, ప్రతి జిల్లా



నుండి 72 మంది వరకు క్రీడాకారులు పాల్గొంటారని, సదరు క్రీడా పోటీల నిర్వహణ ఆర్డిటి స్టేడియం నందు గల మూడు గ్రౌండ్లలో నిర్వహించబడునని తెలిపారు. పోటీలో పాల్గొనటకు వచ్చే క్రీడాకారులకు, అమ్మాయిలకు విన్సెంట్ డి పాల్, ఆర్డిటి నందు వసతి ఏర్పాటు, బాలురకు రాజేంద్ర మున్సిపల్ హై స్కూల్ నందు వసతి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వసతి, క్రీడా ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణ, త్రాగునీటి ఏర్పాటు, మరుగుదొడ్లు, ఎలక్ట్రిసిటీ, క్రీడాకారులను తరలించుటకు వాహనాల



ఏర్పాటు తదితర ఏర్పాట్లు అన్ని పక్కాగా ఉండాలని, జిల్లా స్పోర్ట్స్ అభివృద్ధి అధికారి సమన్వయం చేసుకోవాలని, సంబంధిత అధికారులు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఇందులో ఫైనల్ క్రీడల్లో విన్నర్, రన్నర్లకు ట్రోఫీ అందజేయడం జరుగుతుందని తెలిపారు.
ఈ సమావేశంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారిణి మంజుల, కడప స్పోర్ట్స్ స్కూల్ కో ఆర్డినేటర్ , స్పెషల్ ఆఫీసర్ జగన్నాథ్ రెడ్డి, ఆన్ సెట్ శ్రీనివాస్, తదితర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సత్యసాయి సేవలు ప్రపంచానికే ఆదర్శం

### బాబా ఆరాధనోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

**శ్రీ సత్యసాయి/పుట్టపర్తి ఏప్రిల్ 24,(రిపబ్లిక్ న్యూస్):**
భగవాన్ శ్రీ సత్య సాయి బాబా ఆరాధనోత్సవ కార్యక్రమానికి పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పుట్టపర్తి ప్రశాంతి నిలయంలోని భగవాన్ శ్రీ సత్య సాయి బాబా మహా సమాధిని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి లు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు శాంతి, సౌభాగ్యం కలగాలని ప్రార్థించారు. అనంతరం పుట్టపర్తి హిల్ వ్యూ స్టేడియంలో సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన నారాయణ సేవ కార్యక్రమంలో సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ కార్యదర్శి ఆర్జే రత్నాకర్ తో పాటు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సెంట్రల్ మేనేజింగ్ ట్రస్టీ కార్యదర్శి ఆర్జే రత్నాకర్ గారితో కలిసి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి లు భక్తులకు నూతన



వస్త్రాలు, ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

**ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ భగవాన్ శ్రీ సత్య సాయి బాబా బోధనలు మానవ సేవే మాధవ సేవ అనే సిద్ధాంతాన్ని ప్రపంచానికి తెలియజేశాయని, అలాంటి మహానుభావుడి ఆరాధనోత్సవంలో పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నామని




తెలిపారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ సత్యసాయి ట్రస్ట్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని, ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు,సత్యసాయి భక్తులు, కూటమి పార్టీల నాయకులు సామకోటి ఆదినారాయణ ,బెస్త చలపతి,స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యం

### మైనర్ డ్రైవింగ్‌పై హెచ్చరికలు డ్రంకెన్ డ్రైవ్‌కు చెక్



**రిపబ్లిక్ క్రైమ్, ఏప్రిల్ 24,అనంతపురం**
రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా పోలీసులు రోడ్డు భద్రతపై ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకున్నారు.
పోలీసులు రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ట్రాఫిక్ నియమాల పాటన ఎంత ముఖ్యమో వివరించారు. ప్రమాదాలను తగ్గించడంలో ప్రతి వాహనదారుడి బాధ్యత కీలకమని పేర్కొన్నారు. మైనర్లు వాహనాలు నడపడం చట్ట విరుద్ధమని, అలా చేస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఇది ప్రాణ రక్షణకు అత్యంత కీలకమని తెలిపారు. ఓవర్‌స్పీడ్, ఓవర్‌లోడ్ వాహనాలు ప్రమాదాలకు దారితీస్తాయని, వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షిత ప్రయాణాలు చేయాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# వైసీపీతో నరేంద్ర రెడ్డికి సంభందం లేదు

### కూటమి పాలనలో నగరంలో పెరిగిన అకృత్యాలు

### పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి వీటిని కట్టడి చేయాలి

### విలేకరుల సమావేశంలో మాజీ మేయర్,వైసీపీ నగర అధ్యక్షులు

**రిపబ్లిక్ క్రైమ్, ఏప్రిల్ 24,అనంతపురం**
నగరంలో హనీ ట్రాప్ కేసులో పోలీసులు అదుపులోకి తీసుకున్న రుద్రంపేట నరేంద్ర రెడ్డికి వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఎటువంటి సంబంధం లేదని మాజీ మేయర్ మహమ్మద్ వసీం,వైసీపీ నగర అధ్యక్షులు చింతా సోమశేఖర్ రెడ్డి లు స్పష్టం చేశారు. జిల్లా పార్టీ కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు.

**నగరంలో కబ్జాలు, ఆక్రమణలు, అక్రమాలు, బెదిరింపులు**

ఈ సందర్భంగా మాజీ మేయర్ మహమ్మద్ వసీం :మాట్లాడుతూ గత 4 సంవత్సరాలుగా నరేంద్రరెడ్డిని పార్టీకి దూరంగా ఉంచడం జరిగిందన్నారు. గత సార్వత్రిక ఎన్నికలలో కూడా రాబోయే ఎన్నికల్లో వైయస్సార్ సీపీ కు ఓటు వేయొద్దు అంటూ గ్రామసభల్లో కూడా బహిరంగంగా చెప్పారని గుర్తు చేశారు. గత ఎన్నికల సమయంలో టీడీపీ అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్ నరేంద్రరెడ్డిని వారి ఇంటికి వెళ్లి కలవడం, ఆయన గెలిచిన తర్వాత ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి నరేంద్ర రెడ్డి అభినందించారన్నారు. అయితే నరేంద్రరెడ్డిగతంలో వైయస్ఆర్ సీపీ లో ఉన్నప్పటి ఫోటోతో నిన్నటి నుండి వైయస్ఆర్ సిపి అంటూ ప్రచారం చేస్తున్నారన్నారు. వైయస్ఆర్ సిపి అధికారం కోల్పోయినప్పుడు కూడా 101



టెంకాయలు కొట్టి నరేంద్రరెడ్డి. తన ఆనందం వ్యక్తం చేశారని వైసీపీ చెందిన వ్యక్తి అయితే అలా ఎందుకు చేస్తారని ఆయన ప్రశ్నించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో అనంతపురం లో ఇలాంటి ఘటనలు ఎప్పుడైనా జరిగాయా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలో నగరంలో అకృత్యాలు పెరిగిపోయాయని ఆయన విమర్శించారు. నగరంలో కబ్జాలు, ఆక్రమణలు, అక్రమాలు, బెదిరింపులు ఏ స్థాయిలో జరిగాయో ప్రజలు అందరికి తెలుసునన్నారు. గతంలో హైదరాబాద్, బెంగళూరు వంటి పెద్ద పెద్ద నగరాల్లో ఇలాంటి హని ట్రాప్ లు జరిగేవని కూటమి నేతల అండ, పోలీస్ ల నిర్లక్ష్యంతో అనంతపురంలో ఇలాంటి ఘటనలు జరగడం సిగ్గుచేటన్నారు. ఈ ట్రాప్ లో ఇంకా ఎంతో మంది భాదితులు ఉన్నారని కానీ చాలామంది బయటకి రావడం లేదన్నారు. హని ట్రాప్ కు పోలీసులు బాధ్యత వహించి ఇంకా ఎవరైనా బాధితులు ఉంటే వాళ్ళని విచారించి తగిన శిక్షలు విధించాలని ఆయన కోరారు. అంతేకాకుండా రాబోయే రోజిల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు.

**హనీ ట్రాప్ ల వలలో పడి బాధితులు ఆత్మహత్యలు**

వైసీపీ నగర అధ్యక్షులు చింతా సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ నగరంలో హని ట్రాప్ ను ఛేదించిన ఎస్పీ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేస్తున్నామన్నారు. గతంలో జిల్లా లో రైతు ఆత్మహత్యలు చూశామని ఇప్పుడు ఇలాంటి ట్రాప్ ల వలలో పడి బాధితులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి చూస్తున్నామన్నారు. రుద్రంపేట నరేంద్ర రెడ్డిని పార్టీ ఎప్పుడో 4సంవత్సరాల క్రీతమే దూరం పెట్టామన్నారు. ఆంధ్రజ్యోతి పత్రికలో గత ఎన్నికల సమయంలో నరేంద్ర రెడ్డి వైయస్ఆర్ సీపీ పై అసంతృప్తి అంటూ రాశారని మళ్ళీ ఇప్పుడు అదే నరేంద్రను పట్టుకుని వైయస్సార్ సీపీ అంటూ రాస్తున్నారన్నారు. అదే విధంగావ్ ఓ ప్రముఖ ఛానల్ గత ఎన్నికల సమయంలో నరేంద్రను వైసీపీ దూరం పెట్టారని చెప్పారని మళ్ళీ అదే ఛానల్ ఇప్పుడు వైకాపా అంటూ ప్రచారం చేస్తున్నారన్నారు. పత్రికలే పార్టీకి పలన నేత దూరం అని రాస్తారని మళ్ళీ అవే సంస్థలు ఏమైనా సంఘటనలు జరిగినప్పుడు వారిని మళ్ళీ పార్టీకి ఆపాదిస్తూ రాస్తున్నారన్నారు. అసత్య ప్రచారాలు మాని ఇప్పటికైనా ప్రజలకు మంచి జరిగే విషయాలను ప్రచురణ చేయాలని ఆయన సూచించారు. నగరంలో గంజాయి, బెల్ట్ షాపులు మితిమీరి పోయాయని విచ్చల విడిగా పర్మిట్ రూమ్ లు పెట్టి నగరాన్ని భ్రష్టు పట్టిస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రభుత్వం పై విమర్శలు చేస్తే పోలీసులు అత్యుత్సాహంతో సుమోటోగా తీసుకుని అక్రమ కేసులు పెడుతున్నారని,పోలీసులు ప్రభుత్వానికి లోబడి కాకుండా, ప్రజల పక్షాన పని చేయాలని ఆయన సూచించారు. పార్టీలకు అపాదించకుండా ఈ హని ట్రాప్ లో ఎవ్వరు ఉన్నా ఉపేక్షించకుండా ఇంకా లోతుగా విచారణ చేపట్టి బాధితులకి న్యాయం చేయాలని ఇలాంటి ఘటనలు పునావృత్తం అవ్వకుండా అసాంఘిక కార్యక్రమాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# వైసీపీ సీనియర్ నాయకుడు మల్లప్ప మృతి

### నివాళులర్పించిన వైసిపి నేతల నివాళులు

**రిపబ్లిక్ క్రైమ్, ఏప్రిల్ 24,కుందుర్పి /అనంతపురం**
అనంతపురం జిల్లా కుందుర్పి మండలం తూముకుంట గ్రామానికి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కురుబ మల్లప్ప అనారోగ్యంతో మృతి చెందడం గ్రామంలో విషాదాన్ని నింపింది. . పార్టీకి అంకితభావంతో సేవలందించిన మల్లప్ప మరణం తీరని లోటని మండల కన్వీనర్ కె. హనుమంతరాయుడు పేర్కొన్నారు. శుక్రవారం కళ్యాణదుర్గం అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎంపీ డా. తలారి రంగయ్య ఆదేశాల మేరకు మల్లప్ప పార్థివ దేహానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గ్రామ ప్రజలు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కన్నీటి నివాళులు అర్పించారు.





మల్లప్ప రాజకీయ జీవితంలో పలు ఎన్నికల్లో పోటీ చేశారు. 2014లో సర్పంచ్‌గా పోటీ చేసి ఓటమి చెందగా, అనంతరం ఎంపీటీసీగా పోటీ చేసే అవకాశం కూడా లభించిందన్నారు. 2019లో మరోసారి సర్పంచ్‌గా పోటీ చేసినా విజయం సాధించలేకపోయారు. అయినప్పటికీ పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేస్తూ గ్రామంలో పార్టీ బలోపేతానికి కృషి చేశారని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు ఏఆర్ వన్నూర్ రెడ్డి, మాజీ సర్పంచ్ రామమూర్తి, ఎంపీటీసీ డా. ఈరన్న, బసవరాజు, తిమ్మరాజు, గంగాధర్, మల్లి, రఘు తదితర నాయకులు పాల్గొన్నారు.

# బైండోవర్ ఉల్లంఘనపై ఆరుగురికి రిమాండ్



**రిపబ్లిక్ క్రైమ్, ఏప్రిల్ 24,యల్లనూరు / అనంతపురం:**అనంతపురం జిల్లా యల్లనూరు మండలంలో బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన ఆరుగురిపై పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. 14 రోజుల రిమాండ్ విధించి తాడిపత్రి సబ్ జైలుకు తరలించారు. యల్లనూరు మండలం బొప్పేపల్లి గ్రామానికి చెందిన గండి కోట నారాయణస్వామి, పత్తికొండ ఆదినారాయణ, పొగాకుల చైతన్య, కప్పల నారాయణస్వామి, బండి నారాయణస్వామి, కప్పల లక్ష్మీనారాయణలను ట్రబుల్ మాంగర్స్‌గా గుర్తించి, 05.05.2025న మంచి ప్రవర్తన కోసం ఎమ్ ఆర్ ఓ ముందు బైండోవర్ చేశారు. అయితే బైండోవర్ నిబంధనలను ఉల్లంఘిస్తూ 11.07.2025న యల్లనూరు మండలం కూచివారిపల్లి వద్ద జరిగిన క్రిమినల్ కేసులో పాల్గొన్నారు. దీనిని తీవ్రంగా పరిగణించిన మండల మేజిస్ట్రేట్ రాము ఆరుగురికి 14 రోజుల రిమాండ్ విధించారు. ఈ మేరకు నిందితులను తాడిపత్రి సబ్ జైలుకు తరలించినట్లు యల్లనూరు ఎస్ఐ ఎన్. రామాంజినేయ రెడ్డి తెలిపారు.

# వేసవికాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**మహానంది ఏప్రిల్ 24 (రిపబ్లిక్ న్యూస్):-**ఆందోళనకర స్థాయిలో ఎండలు, వడగాడ్పులు వీస్తున్న తరుణంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తిమ్మాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వేణు కార్తికేయ పేర్కొన్నారు. మహానంది మండలం కేంద్రం తిమ్మాపురం గ్రామంలోని శ్రీ అంకాల పరమేశ్వరి దేవి ఆలయం ఆవరణలో వడదెబ్బ లక్షణాలు–తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పిల్లలు,వృద్ధులు, గర్భిణుల విషయంలో మరింత అప్రమత్తత ఉండాలన్నారు. వడదెబ్బ వల్ల కొన్నిసార్లు ప్రాణాపాయ పరిస్థితికి దారి తీస్తుందని,తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డీ హైడ్రేషన్ గురికాకుండా ఓఆర్ఎస్ ద్రావణం,తగినంత నీరు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఇంటి ఆవరణలో చెట్లను పెంచాలి,వాటిని సంరక్షించాలన్నారు. అవకాశం ఉంటే ఇంటి ఆవరణలో తాటాకు గుడిసెలు ఏర్పాటు చేసుకొని సేదతీరే విధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ అమీనాబీ,ఏఎన్ఎం దుర్గాదేవి, వైద్య సిబ్బంది,ఆశా కార్యకర్తలు,పాల్గొన్నారు.



# పారిశుద్ధ్య పనులు పక్కాగా అమలు చేయాలి

**100% చెత్త సేకరణే లక్ష్యం హాజరు, డ్రెస్ కోడ్ తప్పనిసరి -నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 24)**
కర్నూలు నగరంలోని అన్ని శానిటేషన్ డివిజన్లలో పారిశుద్ధ్య పనులు కచ్చితంగా, సమర్థవంతంగా అమలు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి లోపాలు చోటు చేసుకోకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆయన స్పష్టం చేశారు.

శుక్రవారం బుధవారపేట, సి.క్యాంపు ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల సందర్భంగా ఆయన పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించి, సిబ్బంది హాజరును తనిఖీ చేశారు.

**ఉదయం హాజరు కఠిన నియమాలు**

సిబ్బంది ఉదయం 5:15 గంటలకల్లా హాజరు కావాలని, 5:30 గంటలకు విధుల్లోకి వెళ్లాలని కమిషనర్ ఆదేశించారు. ప్రతి కార్మికుడు తప్పనిసరిగా డ్రెస్ కోడ్ పాటించాలని, లేనిపక్షంలో గైర్హాజరు నమోదు చేయాలని హెచ్చరించారు.

**ఇంటి వద్దే చెత్త సేకరణ**

ప్రతి ఇంటి వద్ద విజిల్ వేయడం, కాలింగ్ బెల్ కొట్టడం ద్వారా చెత్తను తప్పనిసరిగా సేకరించి 100 శాతం చెత్త సేకరణ లక్ష్యాన్ని సాధించాలని స్పష్టం చేశారు.

**డంప్ యార్డుల అభివృద్ధిపై దృష్టి**

గార్గేయపురం, జొహరపురం డంప్‌యార్డులను పరిశీలించిన కమిషనర్:

గార్గేయపురంలో బయో మైనింగ్ పనులు వచ్చే నెలాఖరులోపు పూర్తి చేయాలనివేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్, ఎంఆర్ఎఫ్ ప్లాంట్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలనిజొహరపురం డంప్‌యార్డులో పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారుఅదేవిధంగా, సి & డి వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్‌ను త్వరలో ప్రారంభించి ఇటుకల తయారీ చేపట్టాలని సూచించారు. కుక్కల సంతాన నియంత్రణ కేంద్రాన్ని కూడా త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నాగరాజు, ఎంఈ గిరిరాజ్, డిఈఈలు పవన్ కుమార్ రెడ్డి, వెంకటేశ్వర్లు (పి.హెచ్.), ఏఈ సి.వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

## చిప్పగిరి లో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం




**చిప్పగిరి, ఏప్రిల్, 24,( రిపబ్లిక్ న్యూస్)** చిప్పగిరి స్థానిక ఎంపిడిఓ ఆఫీస్ నందు శుక్రవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం ఎంపీడీవో అల్లా బకాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు, ఎంపీడీవో మాట్లాడుతూ పల్లె అభివృద్ధికి, ప్రజాస్వామ్య బలో పేతానికి పునాది అని, గ్రామ స్వరాజ్యం, స్థానిక స్వపరిపాలన, గ్రామీణ మహిళలు, బలహీన వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించేందుకు ఏప్రిల్ 24 న 73 వ రాజ్యాంగ సవరణ చట్టం అమలులోకి వచ్చిన సందర్భంగా ఈ రోజు జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు, ఈ కార్యక్రమంలో సచివాలయ డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రామబ్రహ్మం, జూనియర్ అసిస్టెంట్ సంజీవ్, ఏవో శ్రీనివాసులు, పంచాయతీ సెక్రెటరీ సిసింద్రి, అస్పిరేషనల్ అధికారి నరసింహులు, సచివాలయ సిబ్బంది అశ్విని,ఉపాధి హామీ టిఏలు మారుతి, శర్మస్ ,నాగేంద్ర, రమేష్, రాంప్రసాద్, కంప్యూటర్ ఆపరేటర్లు యాసిన్ ఖాజ, మున్నా, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

# రాత్రివేళల్లో కర్నూలులో కట్టుదిట్టమైన విజిబుల్ పోలీసింగ్

**నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు అనుమానాస్పద వాహనాలపై తనిఖీలు ముమ్మరం**





**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 24)**
జిల్లాలో శాంతిభద్రతలను మరింత బలోపేతం చేయడానికి కర్నూలు పోలీసులు రాత్రి వేళల్లో విజిబుల్ పోలీసింగ్‌ను కట్టుదిట్టంగా అమలు చేస్తున్నారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నారు.ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని నేరాల నియంత్రణ కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు.గురువారం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు కర్నూలు రెండవ పట్టణ సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో బ్లూ కోల్ట్స్ బృందాలు మరియు క్యూఆర్టీ బృందాలు పాల్గొని కట్టుదిట్టంగా తనిఖీలు చేపట్టాయి.అనవసరంగా రాత్రివేళల్లో బయట తిరిగే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ప్రజలు పోలీసులకు సహకరించి, తమ భద్రతకు తోడ్పడాలని కోరారు.ఏవైనా అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు వెంటనే డయల్ 112 లేదా 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

# ఇష్టంతో పనిచేస్తేనే ఉత్తమ ఫలితాలు: కమిషనర్ చల్లా ఓబులేసు

**ఒత్తిడికి లోనుకాకుండా సమిష్టిగా పనిచేయాలి క్షేత్రస్థాయి పర్యటనలు తప్పనిసరి**

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 24)**
నగరపాలక సంస్థ సమావేశంలో కమిషనర్ మార్గదర్శకాలువిధులను కష్టంగా భావించకుండా ఇష్టంతో పనిచేస్తేనే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు సిబ్బందికి సూచించారు. పనిపై ఆసక్తి పెంపొందించుకుని సమిష్టిగా ముందుకు సాగితే సంస్థను అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలపవచ్చని పేర్కొన్నారు. ఎస్బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని సమావేశ భవనంలో నిర్వహించిన ముఖ పరిచయ సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ, భయపెట్టి పనులు చేయించే విధానం తనది కాదని స్పష్టం చేశారు. ఎవరికీ రాని పనులను బలవంతంగా చేయించబోనని, అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందరూ అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. పనిభారం పెరిగినప్పుడు కుటుంబ సభ్యుల్లా కలిసి పనిచేయాలని చెప్పారు.

సిబ్బంది సమయానికి కార్యాలయానికి హాజరై, ఫైళ్లను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి రోజు ఉదయం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవాలని సూచించారు. ప్రజల ఫిర్యాదుల పరిష్కారంలో ఆలస్యం చేయవద్దని స్పష్టం చేశారు.

పట్టణ ప్రణాళిక విభాగ అధికారులతో సమావేశమై అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని



ఆదేశించారు. ప్లాన్‌కు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలకు నోటీసులు ఇవ్వాలని, నిర్మాణ దశలోనే నిబంధనలు అమలు చేయాలని చెప్పారు. డ్రైనేజీ కాలువలపై ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించాలని సూచించారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని, నిర్మాణాలు పూర్తయ్యాక స్వయంగా పరిశీలించి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు జారీ చేస్తానని తెలిపారు.

పారిశుద్ధ్య విభాగంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచిస్తూ 100 శాతం చెత్త సేకరణ లక్ష్యంగా పని చేయాలని ఆదేశించారు. ప్రతి వార్డులో రెండు మైక్రో పాకెట్లను మోడల్‌గా అభివృద్ధి చేయాలని సూచించారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరణ, మరుగుదొడ్ల నిర్వహణ, మరమ్మత్తుల పనులను సమర్థవంతంగా నిర్వహించాలని చెప్పారు.





ప్రతి శుక్రవారం ఓపెన్ ఫోరం నిర్వహిస్తామని, సిబ్బంది సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరిస్తామని కమిషనర్ తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కమిషనర్ ఆర్జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ఎస్ఈ రమణమూర్తి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, ఇంచార్జి సిటీ ప్లానర్ వై. వెంకటరమణ, ఆర్వోలు స్వర్ణలత, వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ కైరవాడి పంచాయతీ నిధులు గోల్ మాల్

**-బిజేపీ నాయకులు**

**ఎమ్మిగనూరు, ఏప్రిల్, 24,(రిపబ్లిక్ న్యూస్ ):**
హెచ్ కైరవాడి గ్రామ పంచాయతీ నిధులు గోల్ మాల్ జరిగాయి అని బిజేపి నేతలు మల్లికార్జున, భీమా నాయుడు , గఫూర్,లు ఆరోపించారు.ఈ సందర్భంగా శుక్రవారం గ్రామ సభ కార్యక్రమంనిర్వహించారు.గ్రామసభలో బిజేపి నేతలు మాట్లాడుతూ 2023-2024- నిధులు 23,16,772/- రూపాయాలు, 2024-2025,నిధులు 22,47,966 రూపాయలు 2025-2026 నిధులు 9,95,965రూపాయాలు ఇంత మొత్తం డబ్బులు మంజూరు అయితే ఎక్కడ ఎక్కడ ఖర్చు పెట్టారు చూపించండి పంచాయతీ కార్యదర్శి అడగా సమాధానం దాట వేశారు.ఈ నిధుల పై జిల్లా ఉన్నాతా అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లాతామని బిజేపి నేతలు తెలిపారు .ఈ కార్యక్రమంలో మల్లికార్జున రెడ్డి, భాస్కర్ రెడ్డి, రాజశేఖర్,జనసేనా నాయకులు రంగస్వామి నాయుడు, పాల్గొన్నారు.




## ప్రజల భాగ్యస్వామ్యంతో గ్రామ అభివృద్ధి సాధ్యం...




**మహానంది ఏప్రిల్ 24 (రిపబ్లిక్ న్యూస్):-**
ప్రజల భాగ్యస్వామ్యంతో గ్రామ అభివృద్ధి సాధ్యమని పంచాయతీ సెక్రెటరీ భాస్కర్ పేర్కొన్నారు.మహానంది స్వర్ణ సచివాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం పురస్కరించుకొని ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు.గ్రామంలో పర్యావరణ పరిరక్షణ,పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని కోరారు. పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా భావించి, స్వచ్ఛతను పెంపొందించాలన్నారు. అనంతరం ప్రజలకు డస్ట్ బిన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో చలమయ్య, సచివాలయ సిబ్బంది, టిడిపి నాయకులు, మహానంది దేవస్థానం మాజీ ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జున రావు,కుంచపు రమణ, పటాల శ్రీనివాసులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.మరియు మండలంలోని అన్ని గ్రామ సచివాలయాలలో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు.గ్రామాల అభివృద్ధిపై చర్చించారు.

# మహిళలు, చిన్నారుల భద్రతపై పోలీసుల అవగాహన కార్యక్రమం

**"మీ రక్షణ మా బాధ్యత" నినాదంతో కర్నూలులో నిర్వహణ -పోక్సో చట్టం, సైబర్ నేరాలు, హెల్ప్‌లైన్‌లపై అవగాహన**

**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 24)**
మహిళలు మరియు చిన్నారుల భద్రతపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు కర్నూలు పోలీసులు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు "మీ రక్షణ మా బాధ్యత" పేరుతో శుక్రవారం ఉదయం కర్నూలు ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీ లక్ష్మి నరసింహ కళ్యాణ మండపంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఇంచార్జ్ డీఎస్పీ ఉపేంద్రబాబు, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ, వన్‌టౌన్ సీఐ మారుతి శంకర్ హాజరై మహిళలు, చిన్నారుల భద్రతపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డీఎస్పీ ఉపేంద్రబాబు మాట్లాడుతూ పోక్సో చట్టం, సైబర్ నేరాలు, బాల్య వివాహాల వంటి కీలక అంశాలపై వివరంగా తెలియజేశారు. పిల్లల రక్షణలో తల్లుల పాత్ర అత్యంత కీలకమని, నమ్మకం లేదా బంధుత్వాల పేరుతో కూడా




నేరాలు జరిగే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించారు. మహిళలు మరియు చిన్నారులు అప్రమత్తంగా ఉండాలని, ఏవైనా అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

సీఐ మారుతి శంకర్ మాట్లాడుతూ నేరాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఫిర్యాదు చేసే విధానం గురించి





వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో "శక్తి యాప్" వినియోగించాలని, అలాగే డయల్ 112, 1098 (చైల్డ్ లైన్), 1091 (మహిళా హెల్ప్‌లైన్) నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మట్టి మాఫియా పై చర్యలు తీసుకోండి.

**వైసీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం నారాయణ రెడ్డి**

**ఎమ్మిగనూరు, ఏప్రిల్ 24,(రిపబ్లిక్ న్యూస్ ):**
గోనెగండ్ల మండలం గంజహళ్లి గ్రామ సర్వే నంబర్ 369/2లోని ఊరు చెరువులో జరుగుతున్న అక్రమ మట్టి మాఫియాపై చర్యలు తీసుకోవాలని వైఎస్ఆర్సీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం నారాయణ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ అండదండలతో మట్టి మాఫియా ప్రకృతి సంపదను నిలువునా దోచుకుంటోందని ఆరోపించారు. ఎమ్మిగనూరు కు చెందిన ఇటుకల బట్టీల వ్యాపారులు వాణిజ్య అవసరాలు కోసమని దరఖాస్తు చేస్తే మైనర్ ఇరిగేషన్ అధికారులు(ఎం ఐ) కేవలం 1000 క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వకానికి ఏప్రిల్ 10 నుండి 17 వరకు అనుమతులు ఇచ్చారని, అయితే అనుమతుల ముసుగులో భారీ యంత్రాలు, టిప్పర్ల సహాయంతో దాదాపు 50 వేల క్యూబిక్ మీటర్ల కంటే ఎక్కువ మట్టిని అక్రమంగా తరలించారని ఆరోపించారు . ఇందుకు




కేవలం లక్ష రూపాయల చలానాను ఇటుకల వ్యాపారులు ప్రభుత్వానికి చెల్లించి, దాదాపు రూ.2 కోట్ల విలువైన సహజ సంపదను కొల్లగొట్టారని ధ్వజమెత్తారు. రాత్రిపూట తవ్వకాలు జరపకూడదని, చెరువు కట్ట ఎత్తుకు పది రెట్ల దూరంలో , తూముకు ఎత్తుకు పైనే మట్టిని తవ్వాలని, పగటి పూట అదీ మైనర్ ఇరిగేషన్ శాఖ ఉద్యోగి పర్యవేక్షణలో తవ్వకాలు చేపట్టాలని నిబంధనల్లో ఉందన్నారు. కానీ ఇవేవి లేకుండానే, అధికారుల పర్యవేక్షణ లేకుండానే రాత్రింబవళ్లు వాహనాలతో మట్టిని తరలించారని, నిబంధనలను తుంగలోకి తొక్కి చెరువు గట్టును సైతం తవ్వేశారని దుయ్యబట్టారు. అలాగే 14 మంది బినామీ రైతుల పేరుతో ఇదే మాఫియా 10వేల క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వకానికి ఏప్రిల్ 25 వరకు అనుమతులు పొంది, రైతుల పేరిట సైతం మట్టి మాఫియా 50 వేల క్యూబిక్ మీటర్ల స్థాయిలో మట్టిని తరలించారని ఆరోపించారు. మట్టి తవ్వకాల వల్ల చెరువు కట్ట దెబ్బతిందని, భవిష్యత్తులో నీటి నిల్వ సామర్థ్యం తగ్గి రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమాలను ప్రశ్నించిన గంజహళ్లి రైతులపై పోలీసులతో బెదిరింపులకు పాల్పడటం, ట్రాక్టర్ డ్రైవర్లపై దాడులు చేయడం దుర్మార్గమని విమర్శించారు. మైనర్ ఇరిగేషన్ , మైనింగ్, రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక ఉన్న మతలబు ఏమిటని ఆయన ప్రశ్నించారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి అక్రమ తవ్వకాలకు పాల్పడ్డ బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి ప్రభుత్వ సంపదను రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మాఫీపై జిల్లా కలెక్టర్, నీటిపారుదల శాఖ ఎస్ఈ, గనుల శాఖ డీడీ, ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేసినట్టు వెల్లడించారు. ఇప్పటికైనా చర్యలు తీసుకొని పక్షంలో వైఎస్ఆర్సీపీ రైతు విభాగం ఆధ్వర్యంలో బాధిత రైతులతో కలిసి భారీ ఎత్తున ఆందోళనలు చేపడతామన్నారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:2023/87888
శనివారం 25 ఏప్రిల్ 2026

# కొమ్మూరు సిద్ధారెడ్డి పార్ధివ దేహానికి నివాళులు.





**ఓబులవారిపల్లి ఏప్రిల్ 24 రిపబ్లిక్ న్యూస్.** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కుమ్మరి సుబ్బారెడ్డి శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు విషయం తెలుసుకున్న పర్యటక శాఖ మాజీ డైరెక్టర్ ఓబులవారిపల్లి మండల వైఎస్ఆర్సిపి అధ్యక్షుడు వత్తలూరు సాయి కిషోర్ రెడ్డి, ఓబులవారిపల్లి మాజీ సర్పంచ్ నుకా జైపాల్ రెడ్డి మృతుని స్వగృహానికి వెళ్లి పార్ధివదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు అనంతరం వారి కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలియజేశారు అనంతరం పార్టీ మీకు అండగా ఉంటుందని అన్న విధాల సహాయ సహకారాలు అందిస్తుందని సందర్భంగా వారు కుటుంబ సభ్యులకు తెలియజేశారు, అంతేకాకుండా ఓబులవారిపల్లి మండలం గాడివారిపల్లి సింగిల్ విండో మాజీ ప్రెసిడెంట్ టంగుటూరి కృష్ణారెడ్డి మరియు ఎగువపల్లి వైఎస్ఆర్సిపి యువ నాయకుడు టంగుటూరి సుధాకర్ రెడ్డి ఆయన పార్థివ దేహాన్ని దర్శించి పూలమాలవేసి నివాళులు అర్పించారు, కొమ్మూరు సిద్ధారెడ్డి అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న వైఎస్ఆర్సిపి రాయలసీమ బూత్ కమిటీ కన్వీనర్ ఆయన పార్ధదేహానికి పూలమాలు ఏసి నివాళులర్పించారు,

అలాగే సాయంకాలం పత్రిక ప్రతినిధి జిల్లా స్టాపర్ పాణ్యం చిన్నయ్య, సాక్షి విలేఖరి మౌలానా,

టంగుటూరి రామిరెడ్డి కొమ్మూరు నారాయణరెడ్డి టంగుటూరి చిన్నారెడ్డి నూక వెంకట సుబ్బారెడ్డి, టంగుటూరి శివారెడ్డి, కొమ్మూరి నారాయణరెడ్డి, గాడివారిపల్లి నరసింహారెడ్డి గ్రామ ప్రజలు బంధువులు మిత్రులు కార్యకర్తలు భారీగా పాల్గొని ఆయన అంత్యక్రియలు నిర్వహించడం జరిగినది.

# అందోల్ కుమ్మరిగూడెంలో డ్రైనేజ్ వేయ్యవద్దని గ్రామ ప్రజల ఆందోళన.

## కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే మాకే శాపమా.





**ఆందోల్ ప్రతినిది ఏప్రిల్ 24( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
అందోల్ కుమ్మరిగూడెం లో ఉన్న డబల్ బెడ్ రూమ్ డ్రైనేజ్ పైపులైను ఊరు మధ్యలో నుండి వెయ్యవద్దని గ్రామ ప్రజలు ఆందోళన దిగారు. ఇక్కడ డ్రైనేజ్ వేస్తే పైపులు పగిలినప్పుడు ఆ వాసనకు మేము వసనకీ ఉండబోమని ఇక్కడ నుంచి వేయడం సరికాదని గ్రామ ప్రజలు ఆందోళనకు దిగారు. కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే ఇంత అన్యాయం చేస్తారని మేము అనుకోలేదని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు .
రాబోయే వర్షాకాలంలో నీరు పైపుల నుంచి రిటర్న్ వస్తే పైపులు డీకే జై మా గ్రామంలో గ్రానేజ్ నిండిపోతుందని వారు ఆవేదన పరుస్తున్నారు.ఇక్కడ పైప్ లైన్ వేయడం సరికాదని మమ్మల్ని కాదని పైప్ లైన్ వేస్తే రాస్తారో కాలు ధర్నాలు చేస్తామని గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్త పరుస్తున్నారు. కుమ్మరిగూడెంలో అల్లరి అయితుందని తెలుసుకున్న జోగిపేట్ ఎస్ ఐ పాండుగ్రామ వారికి నచ్చ చెప్పడానికి జోగిపేట ఎస్సై పాండు గ్రామ ప్రజలకు నచ్చజెప్పి అల్లరి కాకుండా చూశారు. కార్యక్రమంలో గ్రామ మహిళలు యువకులు, పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జోగిపేటలో అంగన్వాడి అన్యువల్ డే సంబరాలు.

## ముఖ్య అతిథి వైస్ చైర్మన్ చిట్టిబాబు.





**అందోల్ ప్రతినిధ ఏప్రిల్ 24( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**అందోల్ జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో ఉన్న అంగన్వాడి స్కూల్లో అన్యువల్ డే సంబరాలు చేశారు. గత ఐదు సంవత్సరాల కంప్లీట్ అయిన తర్వాత ప్రభుత్వం బడికి వెళ్ళడానికి సిద్ధమైన చిన్నారి పిల్లలకు చిరు సన్మాన కార్యక్రమం చేశారు. తినేటి వస్తువులు చిన్నారి పిల్లలు అలాగే పిల్లల తల్లిదండ్రులు విజయ పాలు ప్యాకెట్స్ మరియు గుడ్లు ఇతరత్రా వస్తువులను వైస్ చైర్మన్ చిట్టిబాబు అందజేశారు.ఈ కార్యక్రమంలో 1వార్డు కౌన్సిలర్ గడ్డి అరుణ్ కుమార్, 16వ వార్డు కౌన్సిలర్ పట్లోల్ల శ్రీనివాస్, 17వ వార్డు కౌన్సిలర్ నేనావత్ మేఘరాణి సైలాన్, 18 వ వార్డు కౌన్సిలర్ బేగరి శశిరేఖ అనిల్, అంగన్వాడీ టీచర్స్ మరియా, నగ్మా, పుష్పలత, పిల్లల తల్లిదండ్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అడ్డు, బాబా తదితరులు పాల్గొన్నారు.

# వంతెనపై టాటా ఏస్ దగ్ధం

## అప్రమత్తతతో తప్పిన భారీ ప్రమాదం

**రిపబ్లిక్ క్రైమ్,ఏప్రిల్ 24, కదిరి / శ్రీ సత్య సాయి**
శ్రీ సత్యసాయి జిల్లా కదిరి సమీపంలోని కౌలేపల్లి వంతెనపై శుక్రవారం టాటా ఏస్ (ప్యాసింజర్ ఆటో) వాహనం అగ్నికి ఆహుతైంది. ప్రయాణికులతో వెళ్తున్న వాహనం వంతెనపై సాగుతుండగా ఒక్కసారిగా ఇంజిన్ నుంచి మంటలు చెలరేగి క్షణాల్లోనే వాహనం మొత్తం వ్యాపించాయి. దట్టమైన పొగతో ప్రాంతం కమ్ముకుంది.మంటలను గమనించిన డ్రైవర్ అప్రమత్తమై వాహనాన్ని వెంటనే ఆపగా, ప్రయాణికులు సురక్షితంగా కిందకు దిగిపోయారు. దీంతో తృటిలో ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటనతో హైవేపై ప్రయాణిస్తున్న వాహనదారులు భయాందోళనకు గురయ్యారు.సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అయితే అప్పటికే వాహనం పూర్తిగా కాలిపోయింది. ఇంజిన్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగానే అగ్ని ప్రమాదం జరిగి ఉండొచ్చని భావిస్తున్నారు.ఈ ఘటనతో కొంతసేపు హైవేపై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# ఇందిరమ్మ ఇండ్ల ఓపెన్ కార్యక్రమంలో మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 24( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
నిరుపేదల సొంత ఇంటి కళను నెరవేర్చడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని తీసుకొచ్చిందని మెదక్ కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు మెదక్ మండలం శివాయపల్లి గ్రామంలో శుక్రవారం పండుగ వాతావరణంలో లబ్ధిదారుల ఇండ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో కలెక్టర్. పాల్గొన్నారు
ఇందిరమ్మ గృహాన్ని కలెక్టర్ ప్రారంభించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల సంక్షేమ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా జిల్లాలో పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు జరుగుతున్నాయని ఈ కార్యక్రమంలో భాగంగా శివాయపల్లి గ్రామంలో



ఇందిరమ్మ గృహ లబ్ధిదారులు తోట లక్ష్మి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందని తెలిపారు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పక్కాగా పారదర్శకంగాజరుగుతుందన్నారు

సొంత స్థలం ఉండి ఇల్లు లేని వారికి మొదటి ప్రాధాన్యతగా గుర్తించి వారికి ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు.
ఇందిరమ్మల నిర్మాణం కోసం ప్రభుత్వం
విడుదలవారీగా నిధులు విడుదల చేస్తున్నారు. ఒక్కో గృహ నిర్మాణానికి ఐదు లక్షలు అందించడం జరుగుతుందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలనిసూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు 750 ఇందిరమ్మ ఇండ్లు పూర్తయ్యాయని, మిగిలిన వారు కూడా త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 650 ఇండ్లు గృహప్రవేశాలు చేయడం జరిగిందని తెలిపారు.

# జలధారజల హారతితో గ్రామాల్లో నీటి విప్లవం

## భూగర్భ జలాల పెంపు, సాగునీటి భద్రతే లక్ష్యం వీబీ జీ రామ్ జీ పథకం సద్వినియోగం చేయాలని కలెక్టర్ డా. ఏ. సిరి పిలుపు

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 24)**
గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరులను పునరుద్ధరించి, భూగర్భ జలాలను పెంపొందించేందుకు జలధారజల హారతి కార్యక్రమం సమర్థవంతంగా అమలవుతోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా నీటి భద్రతను బలోపేతం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.
శుక్రవారం కృష్ణగిరి మండలం అమకతాడు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో భాగంగా చౌడమ్మ చెరువు, భద్రుడు చెక్ డ్యామ్ పనులకు కలెక్టర్ భూమిపూజ చేసి పూడికతీత పనులను ప్రారంభించారు.
కలెక్టర్ వివరాల ప్రకారం, ఎత్తైన ప్రాంతాల నుండి వర్షపు నీటిని దిగువ ప్రాంతాలకు మళ్లించి చెరువులు, చెక్ డ్యామ్‌లలో నిల్వ అయ్యేలా ప్రణాళికలు రూపొందించారు. భద్రుడు చెక్ డ్యామ్ సుమారు 20 మీటర్ల లోతు, 200 మీటర్ల పొడవుతో నిర్మించబడుతూ, దాదాపు 18 లక్షల లీటర్ల నీటిని నిల్వ చేసే సామర్థ్యం కలిగి ఉంటుంది. దీని ద్వారా సుమారు 15 హెక్టార్ల వ్యవసాయ భూమికి సాగునీరు అందే అవకాశం ఉంది.
అదేవిధంగా ఉప్పువంక, పడమరవంక వంటి వంకల ద్వారా హెచ్.ఎన్.ఎస్.ఎస్ కాలువను చెరువులు, కుంటలు, కాలువలతో అనుసంధానం చేసే పనులు, పూడికతీత, మరమ్మత్తులు, జంగిల్ క్లియరెన్స్ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. హంద్రీ–నీవా కాలువ నీటిని సమర్థంగా వినియోగించి భూగర్భ



జలాలను పెంచే చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఈ చర్యల వల్ల బోర్‌వెల్స్‌లో నీటి లభ్యత పెరిగి భూగర్భ జలాలు గణనీయంగా మెరుగుపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. జలధారజల హారతి ద్వారా భూగర్భ జలాలను కనీసం 3 మీటర్ల మేర పెంచడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు చెప్పారు.
జిల్లాలోని 246 ఎం.ఐ ట్యాంక్‌లకు అనుసంధానంగా మొత్తం 3,445 పనులను గుర్తించి, వీటిని వీబీ జీ రామ్ జీ పథకం ద్వారా అమలు చేస్తున్నట్లు తెలిపారు.
వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని శ్రామికులు ఉదయం 6 గంటలకే పనులకు హాజరవుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కలెక్టర్ సూచించారు.
రైతులు తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలని, మిల్లెట్స్ వంటి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఒకే పంటపై ఆధారపడకుండా



బహుళ పంటల సాగు ద్వారా ఆదాయం పెంచుకోవచ్చని తెలిపారు.
పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని, పశుపోషణతో పాటు సేంద్రియ వ్యవసాయం కూడా బలోపేతం అవుతుందని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని రైతులు ఆర్థికంగా బలపడాలని కోరారు.ఈ కార్యక్రమంలో డ్వామా పిడి నరసింహారెడ్డి, ఇరిగేషన్ ఎస్.ఈ బాలచంద్రారెడ్డి, ఆర్డీఓ మధుసూదన్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆలంకొండ నబీ తదితరులు పాల్గొన్నారు.

# స్నేహం శత్రుత్వంగా మారి ప్రాణహాని...

## ఉయ్యాలవాడలో దారుణం -గొడవలో కత్తిపోటు

### ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మనోజ్ మృతి

### గ్రామంలో ఉద్రిక్తతలు, పోలీసుల పహారా





**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 24)**
కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడ గ్రామంలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. ఇద్దరు స్నేహితుల మధ్య జరిగిన చిన్న గొడవ చివరకు ప్రాణాంతకంగా మారింది.గ్రామానికి చెందిన వంశీ, మనోజ్ మధ్య వ్యక్తిగత విషయాలపై తలెత్తిన వివాదం క్రమంగా తీవ్రరూపం దాల్చింది. ఈ క్రమంలో ఆగ్రహానికి లోనైన వంశీ, మనోజ్ మెడపై కత్తితో దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు.తీవ్రంగా గాయపడిన మనోజ్‌ను వెంటనే సమీప ఆసుపత్రికి తరలించినప్పటికీ, చికిత్స పొందుతూ అతను మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.సంఘటన అనంతరం ఉయ్యాలవాడలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడగా, సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పహారా కట్టారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితుడు వంశీని అదుపులోకి తీసుకునే చర్యలు చేపట్టారు. గొడవకు గల అసలు కారణాలపై దర్యాప్తు కొనసాగుతోంది.
ఇలాంటి ఘటనలు సమాజంలో పెరుగుతున్న ఆగ్రహ స్వభావాన్ని ప్రతిబింబిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# నూతన ఏజీపీగా సీనియర్ న్యాయవాది మంకు చిట్టిబాబు ఎంపిక.

**ఓబులవారిపల్లిఏప్రిల్ 24 రిపబ్లిక్ న్యూస్.**
రైల్వే కోడూరు పట్టణం జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఏజీపీ, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ గా ప్రముఖ న్యాయవాది మంకు చిట్టిబాబును ప్రభుత్వం తరపున న్యాయవాదిగా నియమిస్తూ ఏపీ ప్రభుత్వం న్యాయశాఖ నిర్ణయం తీసుకున్నది, ఈ పదవిలో ఆయన మూడు సంవత్సరాల పాటు ప్రభుత్వం తరపునసేవలు అందించనున్నారు, ప్రభుత్వం తరపున ఎటువంటి కేసులు



వచ్చిన వాటిని వాదించేందుకు నియమించినట్లు వారు తెలిపారు, ఈయన తెలుగు దేశం తరపున పార్టీలో కీలక పాత్ర పోషిస్తూ తెలుగుదేశం పార్టీ విజయం కోసం కృషి చేసిన న్యాయవాది చిట్టి బాబును టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు ప్రజలు అయన ఎంపిక పట్ల హర్షం వ్యక్తం చేసారు,



# అటవీ ప్రాంతంలో పనుల పరిశీలన

**బండి ఆత్మకూరు, ఏప్రిల్ 24, (రిపబ్లిక్ న్యూస్):-** నల్లమల అటవీ ప్రాంతంలోని నారపురెడ్డి కుంట బీట్ పరిధిలో గత ఏడాది చేపట్టిన పనులను స్క్వాడ్ రేంజ్ ఆఫీసర్ మధుసూదన్ రెడ్డి, పరిశీలించారు. శుక్రవారం ఆయన స్థానిక రేంజ్ ఆఫీసర్ నాషీర్ ఝూతో కలిసి క్షేత్రస్థాయిలో తిరిగి 2024, 25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఆయన తనిఖీ చేశారు. ఫారం ఫండ్స్, చెక్ డ్యామ్, జంతువుల నీటి అవసరాల కోసం నిర్మించిన నీటి పొట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్క్వార్డ రేంజర్ అటవీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. వారి వెంట ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు కాసిం నాయక్, నాగరాజు, బీట్ ఆఫీసర్లు రాజేష్, ప్రసన్న, గాయత్రి, ఇతర ఫారెస్ట్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# నంద్యాల తాగునీటి పై సమీక్ష



**నంద్యాల క్రైం, ఏప్రిల్ 24, (రిపబ్లిక్ న్యూస్):** వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో నంద్యాల నియోజకవర్గంలో తాగునీటి సరఫరా నిరంతరంగా కొనసాగేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారితో కలిసి తాగునీటి పరిస్థితిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అర్బన్, రూరల్ ప్రాంతాలు, గోస్పాడు మండలంలో ఎలాంటి నీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యంగా కే.సీ. కెనాల్‌పై ఆధారపడి ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో నీటి సరఫరా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. మున్సిపాలిటీఆర్‌డబ్ల్యూఎస్ శాఖల సమన్వయంతో సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ప్రజలకు అంతరాయం లేకుండా తాగునీటి సరఫరా అందేలా మున్సిపల్ శాఖ అవసరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు సూచించారు. పట్టణాభివృద్ధి అంశంపై మంత్రి మాట్లాడుతూ, నంద్యాలలో అనియంత్రిత నిర్మాణాలను నియంత్రించి క్రమబద్ధ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని అన్నారు. పట్టణ సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నంద్యాల ముందంజలో నిలవాలని లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శేషన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శ్రీనివాసులు, పబ్లిక్ హెల్త్ శాఖ అధికారులు, ఆర్డీఓ విశ్వనాథ్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాలలో ఇంధన సరఫరాపై కలెక్టర్, ఎస్పీ సమీక్ష

**పెట్రోల్, డీజిల్ కొరతపై తక్షణ చర్యలకు ఆదేశాలు**

**వ్యవసాయ అవసరాలకు డీజిల్ సరఫరాకు ప్రాధాన్యత**

**బ్లాక్ మార్కెటింగ్‌పై కఠిన హెచ్చరికలు**


**పెట్రోల్ బంకుల వద్ద శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి**

**ఇంధన సంస్థలతో సమన్వయం**

**- కొరత నివారణకు చర్యలు**

**జిల్లాలో 199 పెట్రోల్ బంకులు - సరఫరా పర్యవేక్షణ కట్టుదిట్టం**

**ఎక్కడా ఇంధన కొరత లేకుండా చర్యలు తీసుకుంటాం: కలెక్టర్ జి. రాజకుమారి**





**నంద్యాల బ్యూరో, ఏప్రిల్ 24 (రిపబ్లిక్ న్యూస్):** జిల్లాలో ఎక్కడా ఇంధన కొరత లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి వెల్లడించారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్‌లో, గత రెండు రోజులుగా జిల్లాలో ఏర్పడిన పెట్రోల్, డీజిల్ సరఫరా అంతరాయంపై జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నంద్యాల జిల్లాలో ఇంధన కొరత సమస్య తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధతో తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులతో పాటు పెట్రోల్ బంక్ యజమానులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు, ముఖ్యంగా వ్యవసాయ కార్యకలాపాలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. జిల్లాలో ఇంధన డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా జరగడం లేదని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. నంద్యాల జిల్లా వ్యాప్తంగా మొత్తం 199 పెట్రోల్ బంకులు ఉన్నాయని తెలియజేస్తూ, జిల్లాకు అవసరమైన ఇంధన నిల్వలను సమకూర్చేందుకు ఉన్నతాధికారులతో సమన్వయం కొనసాగిస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. ఎక్కడా పెట్రోల్ లేదా డీజిల్ కొరత లేకుండా అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. ప్రస్తుతం జిల్లాలో వరి కోతలు కొనసాగుతున్న నేపథ్యంలో సుమారు 40 శాతం పనులు ఇంకా మిగిలి ఉన్నాయని, రైతులు మరియు వ్యవసాయ యంత్రాలకు అవసరమైన డీజిల్ సరఫరా నిరంతరంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రత్యేకంగా ఆదేశించారు. ఇంధనాన్ని నిల్వ ఉంచి బ్లాక్ మార్కెటింగ్ చేయడం, లేదా సాధారణ వినియోగదారులకు ఇవ్వకుండా ఇతర



అవసరాలకు మళ్లించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పెట్రోల్ బంక్ యజమానులకు హెచ్చరించారు. జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ మాట్లాడుతూ పెట్రోల్ బంకుల వద్ద ఎటువంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా శాంతి భద్రతలను కట్టుదిట్టంగా నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో సివిల్ సప్లై అధికారులు రవిబాబు, హెచ్పిసిఎల్, బిపిసిఎల్, ఐవోసీఎల్ నయారా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# 73 మంది సివిల్ పోలీసులకు స్థానచలనం

## జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్






**నంద్యాల క్రైం, ఏప్రిల్ 24, (రిపబ్లిక్ న్యూస్):**
జిల్లాలో పోలీస్ శాఖలో సాధారణ బదిలీలలో భాగంగా ఒకే పోలీస్ స్టేషన్ లో ఐదు సంవత్సరాలకు పైబడి ఉన్న73 మంది పోలీసు సిబ్బందికి శుక్రవారం పట్టణంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆధ్వర్యంలో బదిలీలు చేశారు.
ఈ బదిలీల్లో జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ నుండి ఎంత మంది వచ్చారు ఎన్ని ఖాళీలు ఉన్నాయని తెలుసుకొని వాటి ఆధారంగా బదిలీలు చేశారు. ఇందులో ఏఎస్ఐలు 4 మంది, హెచ్‌సిలు 4 మంది, పిసిలు 65 మంది ఉన్నారు. 08 మంది రిక్వెస్ట్ మేరకు వారిని కూడా బదిలీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో బదిలీలు అనేవి సాధారణం. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాలలో పనిచేయుట మనం సిద్ధంగా ఉండాలని సిబ్బందికి తెలియజేశారు. ఈ బదిలీల కొరకు హాజరైన పోలీసు సిబ్బందితో జిల్లా ఎస్పీ స్వయంగా మాట్లాడి, వారి వ్యక్తిగత సమస్యలు, పిల్లల చదువులు, కుటుంబ సభ్యుల అనారోగ్య కారణాలు, స్పోజ్ కోటాకు ప్రాధాన్యత కల్పించి, గతంలో వారు పనిచేసిన స్టేషన్లు కాకుండా, వివిధ పోలీసు స్టేషనుల్లో ఏర్పడిన ఖాళీలను బదిలీలతో భర్తీ చేశారు. బదిలల్లో ఎటువంటి సిఫార్సులకు తావులేకుండా, సొంత గ్రామం, మండలం, ఇంతకు ముందు పనిచేసిన పోలీస్ స్టేషన్ సర్కిల్ కాకుండా వేరే సర్కిల్లోని పోలీస్ స్టేషన్ లలో ఖాళీలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఆధారంగా చూపించి పోలీస్ స్టేషన్ ఎంచుకోవాలని,అనారోగ్యంతో బాధపడే వారి విజ్ఞప్తి మేరకు పోస్టింగ్ ఇవ్వడం జరిగింది. పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జిల్లా ఎస్పీ వ్యవహరించి బదిలీ చేశారని ఈ బదిలీలలో పాల్గొన్న సిబ్బంది తమ సంతృప్తిని వ్యక్తపరిచారని నంద్యాల జిల్లా పోలీసు సంఘం అధ్యక్షుడు స్వామి నాయక్ తెలియజేసారు. ఈ కార్యక్రమంలో నంద్యాల స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఇన్స్పెక్టర్ మల్లికార్జున గుప్తా, సూర్యమౌళి, డిపిఓ సూపరింటెండెంట్ ఖాదర్ వలి పాల్గొన్నారు.

# బ్రాహ్మణకొట్కూరులో శక్తి యాప్, ప్రస్తుత నేరాలపై అవగాహన

## ఎస్ఐ మణికంఠ



**నంద్యాల క్రైం, ఏప్రిల్ 24, (రిపబ్లిక్ న్యూస్):** జిల్లా పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ మణికంఠ ఆధ్వర్యంలో శుక్రవారం శక్తి టీమ్‌తో కలిపి బ్రాహ్మణకొట్కూరు ప్రైమరీ హెల్త్ సెంటర్ నందు శక్తి యాప్ గురించి, శక్తి యాప్ నంబర్ 7993485111ను అవగాహన కల్పించడం జరిగింది. ఏదైనా పోలీసు వారి అతవసమైన సహాయం కొరకు 100, 112 టోల్ ఫ్రీ నెంబర్ లకు కాల్ చేసి సహాయం పొందవచ్చునని తెలియజేయడం జరిగింది. అనంతరం ఎవరైనా సైబర్ క్రైమ్ నేరాలకు గురైతే టోల్ ఫ్రీ నెంబర్ 1930కి ఫోన్ చేయవలెనని బాల్యవివాహాలు చిన్న పిల్లలపై నేరాలు జరిగినచో 1098 ఫిర్యాదు చేయవలెనని, మహిళల భద్రతకు పోలీసు శాఖ ఎల్లపుడూ అందాహ ఉంటుందని తెలిపారు. వన్ స్టాప్ సెంటర్ యొక్క ప్రాముఖ్యతను తెలిపి శక్తి టీమ్ పనితీరును వివరించి ప్రతి ఒకరి దగ్గర ఉన్న మొబైల్స్ నందు శక్తి యాప్ డౌన్లోడ్ మరియు ఇంస్టాల్ చేపించడంతో పాటు ప్రయోజనాలు వివరించారు. అపరచిత వ్యక్తులు ఎవరన్నా గ్రామమాలలో కనపడిన పోలీస్ వారికీ తెలియజేయాలని, మాదకద్రవ్యాలకు సంబంఢిచిన సమాచారం ఉన్న పోలీసుకు సమాచారం అందించాలని మీ వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. ఈ కార్యాక్రమంలో పిహెచ్సి స్టాఫ్, ఆశ వర్కర్స్,హెల్త్ వర్కర్స్, ప్రజలు పాల్గొన్నారు.

# నంద్యాల ఐఎంఏ, హైదరాబాద్ స్టార్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య సదస్సు.

**...సదస్సులో ప్రసంగించిన హైదరాబాద్ స్టార్ లివర్ సెంటర్ వైద్య నిపుణులు.**

**..లివర్ వ్యాధుల వైద్యంలో వివిధ అంశాలపై ప్రసంగించిన లివర్ మెడికల్ నిపుణులు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, లివర్ ట్రాన్స్ ప్లాంట్ సర్జన్ డాక్టర్ రఘు రామ్ రెడ్డి, ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సురేష్.**





**నంద్యాల , ఏప్రిల్ 24, (రిపబ్లిక్ న్యూస్):-**
భారతీయ వైద్య సంఘం నంద్యాల శాఖ ఆధ్వర్యంలో, హైదరాబాద్ స్టార్ హాస్పిటల్, స్టార్ లివర్ సెంటర్ సహకారంతో స్థానిక ప్రైవేట్ హోటల్ సమావేశ భవనంలో వైద్య సదస్సు నిర్వహించారు.
నంద్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాసరావు అధ్యక్షతన, కార్యదర్శి డాక్టర్ మహమ్మద్ రఫీ నిర్వహణలో జరిగిన ఈ సదస్సులో జాతీయ ఐ.ఎం.ఎ. కేంద్ర కమిటీ సభ్యులు, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు,రాష్ట్ర ఐఎంఏ యాక్షన్ కమిటీ చైర్మన్ డాక్టర్ రవి కృష్ణ సదస్సు ప్రారంభించారు. లివర్ వైద్యనిపుణులు డాక్టర్ శ్రీనివాసరెడ్డి ఎలుకల మందు తాగిన వారిలో లివర్ పై ప్రభావం అంశంపై, లివర్ ట్రాన్స్ ప్లాంట్ సర్జన్ డాక్టర్ రఘురాం రెడ్డి లివర్ ఫెయిల్యూర్ లో లివర్ ట్రాన్స్ ప్లాంట్ ఆవశ్యకత గురించి, ఇంటర్వెషనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సురేష్ హార్ట్ ఫెయిల్యూర్ లో నూతన చికిత్స విధానాలు అంశంపై మల్టీమీడియా సహకారంతో ప్రసంగించారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ వైద్యులు తమ వైద్య పరిజ్ఞానాన్ని నిరంతరం మెరుగుపరుచుకుంటూ, కొత్తగా ఆవిష్కరించిన ఆధునిక వైద్య విధానాలపై అవగాహన పెంచుకోవడం ద్వారా ప్రజలకు మెరుగైన చికిత్సలు అందించడానికి అవకాశం ఉంటుందన్నారు. అందుకోసమే ఐఎంఏ ఆధ్వర్యంలో వైద్యులకు నిరంతర వైద్య విద్యా సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు.
ఈ సందర్భంగా వక్తలను ఐఎంఏ నంద్యాల తరఫున జ్ఞాపికలు అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ నంద్యాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ శ్రీనివాసరావు,డాక్టర్ మహమ్మద్ రఫీ లతోపాటు ఐఎంఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్,నంద్యాల ఐ.ఎం.ఎ రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ మధుసూదన రెడ్డి, డాక్టర్ అనిల్ కుమార్,స్టార్ ఆసుపత్రి ప్రతినిధి ఫక్రుద్దీన్,అధిక సంఖ్యలో నంద్యాల వైద్యులు పాల్గొన్నారు.

## ఈనెల 30న ఎస్ పి వై ఇండస్ట్రీస్ లిమిటెడ్ నందు

# ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్

## -డి ఆర్ ఓ రాము నాయక్



**నంద్యాల బ్యూరో, ఏప్రిల్ 24 (రిపబ్లిక్ న్యూస్):** ఈనెల 30 వ తేదీన నంద్యాల పట్టణంలోని ఎస్ పి వై ఇండస్ట్రీస్ లిమిటెడ్ నందు ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం విజయవాడ సచివాలయం నుంచి డిజాస్టర్ మేనేజ్మెంట్ డైరెక్టర్ ప్రకర్ జైన్, ప్రమాదాలు సంభవించినప్పుడు వాటిని ఎదుర్కొనేందుకు రెవెన్యూ, పోలీస్, ఇతర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి డిఆర్ఓ రాము నాయక్, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఆర్ఓ రాము నాయక్ మాట్లాడుతూ... ప్రకృతి వైపరీత్యాల వల్ల అనుకోని సంఘటనలు జరిగినప్పుడు వాటిని ధైర్యంగా ఎలా ఎదుర్కోవాలి అనే అంశాలకు సంబంధించి ఈనెల 30 వ తేదీన నంద్యాల పట్టణంలోని ఎస్ పి వై ఇండస్ట్రీస్ లిమిటెడ్ నందు మాక్ డ్రిల్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. భారీ వర్షాలు, వరదలు, అగ్ని ప్రమాదాలు తదితర విపత్తుల నుండి సంరక్షించుకునేందుకు తీసుకోవాల్సిన అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని ఈ కార్యక్రమానికి జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది హాజరై మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

# మహిళల భద్రత.. చట్టాలపై అవగాహన

## ప్రజలకు అవగాహన కల్పించిన సీఐ జయరాములు, ఎస్సై జగన్మోహన్





**బండి ఆత్మకూరు, ఏప్రిల్ 24, (రిపబ్లిక్ న్యూస్):-** మహిళల భద్రతకు సంబంధించి ప్రస్తుతం పోలీస్ శాఖలో అమలు అవుతున్న చట్టాలపై పోలీస్ శాఖ అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తుంది. శుక్రవారం మండల కేంద్రం బండి ఆత్మకూరులోని లక్ష్మీ జనార్ధన స్వామి ఆలయంలో నంద్యాల జిల్లా మహిళా పోలీస్ స్టేషన్ సిఐ జయ రాములు, ఎస్ఐ జగన్మోహన్ ఆధ్వర్యంలో మహిళల భద్రత, సోషల్ మీడియా వినియోగంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్యంగా మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, లైంగిక దాడులు, వేధింపుల కేసులు, ఫోక్షో ఆక్ట్ వంటి చట్టాలను మహిళలకు క్షుణ్ణంగా వివరించారు. అత్యవసర సమయాల్లో మహిళలు ఏవిధంగా రక్షణ పొందాలనే అంశంపై అవగాహన కల్పించారు. అలాగే మితిమీరిన సోషల్ మీడియా వినియోగం వల్ల కలిగే అనర్థాలపై సీఐ అవగాహన కల్పించడంతో పాటు సైబర్ నేరాల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో ఇటీవల ఆర్టీవో చలాన్ ఏపీకే, ట్రాఫిక్ చలాన్ ఏపీకే, ఈ చలాన్ ఏపీకే పీఎం కిసాన్ ఏపీకే, ఎస్బిఐ రివార్డ్స్ వంటి లింకులు వైరల్ గా మారుతున్నాయన్నారు. ఇలాంటి సందేశాలు కలిగిన ఏపీకే ఫైల్స్ రూపంలో ముఖ్యంగా మీ వాట్సాప్, ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా మీకు వచ్చే అవకాశం ఉందన్నారు. పైన సూచించిన విధంగా ఏపీకే ఫైల్ వంటి లింకులను క్లిక్ చేసి డౌన్లోడ్ చేసుకుంటే వారి ఫోన్లో వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా వివరాలు సైబర్ నేరగాళ్లు డేటా చోరీ చేసి బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తారన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకొని సామాజిక మాధ్యమాల్లో వచ్చే లింకుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అనంతరం ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి బాల్య వివాహాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో దిశా పోలీసు బృందం, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా వెండి రథంపై ఊరేగుతున్న ప్రహల్లాద రాయలు



**మంత్రాలయం, ఏప్రిల్ ,24, (రిపబ్లిక్ న్యూస్ ):** ప్రసిద్ధి పుణ్యక్షేత్రం దేశంలో రెండో తిరుపతిగా పేరుగాంచిన మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవ మూర్తి ప్రహ్లోద రాయల వెండి రథం పై భక్తులకు దర్శన మిచ్చారు. గురువారం పురస్కరించుకొని శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో అర్చకులు శ్రీ రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేకపూజలు నిర్వహిం చారు. అనంతరం శ్రీ మూల రామదేవులకు ప్రత్యేక పూజలు పీఠాధిపతి నిర్వహించారు. వెండి రథోత్సవంపై ఆలయ ప్రాంగణం చుట్టూ భక్తుల నడుమ ఊరేగించారు అనంతరం ఉంజల సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు , ఐపి నరసింహమూర్తి,పి ఆర్ ఓ వ్యాసరాజ్ ఆచార్ తదితర మఠం సిబ్బంది, భక్తులు అధిక సంఖ్యలో మొక్కులు తీర్చుకున్నారు.

# ప్రజాప్రతినిధులకు జీతాలు ఎందుకు ?

**, ఏప్రిల్ 24, (రిపబ్లిక్ న్యూస్):-**
ఉద్యోగుల బకాయిలు ఆరువేల కోట్లకు పైగా చెల్లించాల్సి ఉందని కేబినేట్ భేటీలో చర్చకు వచ్చింది. గత పదేళ్ల కెసిఆర్ పాలనలో, ఇప్పుడు రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో ఇవి అలాగే ఉండిపోయాయి. ఇంకా పెరిగి పోతున్నాయి. అయినా చీమకుట్టినట్లుగా లేదు. ఉచిత పథకాలకు, దుబారా ఖర్చులకు వెనకాడని ప్రభుత్వం ఉద్యోగుల విషయంలో మాత్రం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది. మంత్రులు, ఎమ్మెల్యలే జీతాల్లో 50శాత ఇప్పుడు వీరికి చెల్లిస్తామని, వందరోజుల్లోగా బకాయిలు పూర్తిగాచెల్లిస్తామని మంత్రులు చెప్పు కొచ్చారు. అసలు మంత్రులు, ఎమ్మెల్యేలకు జీతాలు ఎందుకు? లక్షల్లో వారికి ఎందుకు చెల్లించాలి. ఎందుకు వారికి పెన్షన్లు చెల్లించాలన్నది ఆలోచించాలి. మందు వారి జీతాలను మొత్తంగానే ఆపేయాలి. పెన్షన్లను రద్దు చేయాలి. ప్రజాప్రతినిధులకు లక్షల్లో జీతాలు ఎందుకు? పేరున్న, డబ్బున్న వారు కూడా ఇప్పటికీ పెన్షన్లు పొందుతుననారు. ఎన్నికల సమయంలో ఉచితానుచితాలు మరచి ఎప్పటి కప్పుడు ఆకర్షణీయ పథకాలను గుప్పిస్తున్నారు. అధికారంలో లేన్నప్పుడు ఉచితాల గురించి విమర్శించినవారే, తీరా అధికారంలోకివస్తే అదే ఓటర్లను ఆకట్టుకునేందుకు ఉచిత పథకాలను ఏకరువు పెడుతున్నారు. ఎన్నికల్లో విపరీతంగా డబ్బులు పంచి పెడుతున్నారు. అభివృద్దిని పక్కనపెట్టి ఎన్నికల్లో ప్రయోజనం పొందడాని కన్నట్లు ఉచితాల మీద ఉచితాలు ప్రకటిస్తున్నారు.



వీటివలన పేదలకు చెప్పుకోదగిన శాశ్వత ప్రయోజనం దక్కదు సరికదా, అత్యవసరంగా లాభపడేది పార్టీలు మాత్రమే. ప్రభుత్వాలు ఆర్థికంగా దివాలా కొడుతున్నాయి. జీతాలు ఇవ్వాలంటే మళ్ళీ అప్పులకు దేబిరించాల్సి వస్తోంది. ఉచిత పథకాలతో ప్రజలు సోమరులుగా మారి, పనిచేయడానికి ముందుకు రారని సుప్రీంకోర్టు చేసిన హెచ్చరికను ఎవరూ పట్టించు కున్నట్లు లేదు. అత్యున్నత ధర్మాసనం వ్యాఖ్యలను కూడా సీరియస్‌గా తీసుకోవడం లేదు. ప్రజల బతుకులు బాగుపడే శాశ్వత ఆలోచన చేయడమే ప్రభుత్వ కర్తవ్యం కావాలి. ప్రస్తుత పరిస్థితులలో ఓటు కొనుక్కోకూడదు. ఓటు అమ్ముకోకూడదు అని చెబితే వినే వారెవరూ లేరు. దీనికితోడు ఉచిత పథకాలు రాష్ట్రాల, దేశ ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేస్తున్నా.. అధికారంలో ఉన్నవారు పట్టించుకోవడం లేదు. రాష్ట్రాలు ఆర్థికంగా దివాళా తీస్తున్నా, జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉన్నా పట్టించుకోవడం లేదు. తెలంగాణలో ఇప్పుడు జీతాలు కూడా అప్పులు చేసి ఇవ్వాల్సి వస్తోంది.అధికారంలో ఉండగా తెలంగాణను అప్పుల్లో ముంచిన బిఆర్‌ఎస్ ఇప్పుడు విపక్షంలో ఉంటూ..మరిన్ని ఉచితపథకాల గురించి డిమాండ్ చేస్తున్నారు. తులం బంగారం ఇచ్చారా.. రైతుబంధు వేశారా..పెన్షన్లు నాలుగు వేలు ఇచ్చారా అంటూ నిలదీస్తున్నారు. గురుకులాలు అధ్వానంగా మారడానికి కాంగ్రెస్ కారణమన్నారు. నిజానికి గురుకులాలను లేదా హాస్టళ్లను ఒక్క గొడుగు కిందకు తీసుకుని రావాల్సి ఉంది. విద్య, వైద్యాలకు ఖర్చు చేయకుండా ఉచిత పథకాలకు చేస్తున్న ఖర్చులను వెంటనే ఆపకపోతే జీతాలు ఇవ్వలేరని తేలుతుంది. పెన్షనర్ల బకాయిలు చెల్లించడం లేదు. ఆర్టీసీ సమ్మెకు డబ్బులే కారణం. డబ్బులు ఇవ్వలేక, వారికి చెల్లింపులు చేయలేక,మహాలక్ష్మి పథకంతో దివాళా తీయిస్తూ, ఇవాళ ఆర్టీసీ సమ్మెలో ఓ కార్మికుడిని బలి తీసుకు న్నారు. శంకర్ గౌడ్ మృతి నిజానికి తీవ్ర విషాదం. తెలంగాణ ఉద్యమంలో కూడా ఇలాగే ఆత్మహత్య ల కు కాంగ్రెస్ కారణమయ్యింది. ముందుగా ఆర్టీసీ సమస్యను తేల్చాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది. ఎపిలో జగన్ కూడా ఇదే తరహాలో బటన్ నొక్కుడు పథకాలతో దివాళా తీయించారు. చంద్రబాబు కూడా చేతిక ఎముక లేదన్నట్లుగా పథకాలను అందిస్తున్నారు. ఈ పథకాలు కొంపముంచుతున్నా ,రాష్ట్రాలను దివాళా తీయిస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ఉచితాల పంపిణీలపై రాజకీయ నాయకులకు కనువిప్పు
కావాలి. ప్రభుత్వం ద్వారా అన్నీ ఉచితంగా పొందాలనే మనస్తత్వం కారణంగా దేశంలో అభివృద్ధి కుంటుపడిపోతోంది. ఉచిత పథకాలకి ఖజానా ఖాళీ అయిపోతోంది. దానిని నింపడానికి మళ్ళీ అప్పులు. ఈ పద్దతి ఏ ప్రభుత్వానికీ మంచింది కాదు. లక్షల కోట్లు అప్పులు తెచ్చి, వడ్డీలు కట్టలేక, ఉద్యోగుల జీతాలు కూడా భారమై ప్రభుత్వాలు నవ్వుల పాలవుతున్నాయి. జీతాలు కూడా చెల్లించ లేనప్పుడు మళ్లీ జనం నుంచే వసూలు చేయాలి. ఉచితాల పంపిణీ వలన జనంలో పేదరికం తగ్గిపోయిందని చెప్పడం అలవాటు చేసుకున్నారు. ముఖ్యంగా అధికారంలోకి రావడానికి అనేక విధాలుగా ఉచిత పథకాలపై హామీలు గుప్పిస్తూ, తీరా అధికారంలోకి వచ్చాక చేతులెత్తేయడం పరిపాటిగా మారింది. దీనిపై సుప్రీం ధర్మాసనం గట్టిగానే హెచ్చరించినా పట్టింపు లేదు. ఉచిత రేషన్, ఉచిత గ్యాస్, ఉచిత ఇల్లు, ఉచిత బియ్యం, ఉచితంగా పెన్షన్ వంటివన్నీ ఖజానాను దివాళా తీయిస్తున్నాయి. ఎన్నికల సంఘం కూడా దీనిపై దృష్టి సారించాలి. సంక్షేమం అవసరమే కానీ మోతాదు మించకుండా చూసుకోవడం మంచి పద్ధతి. ఉచితాలను అమలు చేస్తే ఎక్స్ ప్రెస్ వేలు, విమానాశ్రయాలు, రక్షణ కారిడార్లను నిర్మించుకోలేం. విద్య, వైద్యం అందించలేం. ఉచితాల విషయమై రాజ్యాంగపరంగా నిషేధాలు విధించడం అవసరమేమో ఆలోచించాలి. భారతదేశ ఆర్థిక పరిస్థితిని ఆందోళనకర స్థాయికి తీసుకెళ్తాయని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. తెలంగాణ, ఎపిల అభివృద్ధికి ఉచిత పథకాలే అడ్డంకిగా మారాయి. తక్షణం వాటిని నివారించడంతో పాటు. ఈ బాధ్యతను కేంద్రప్రభుత్వమే తీసుకోవాలి. జీతాల చెల్లింపు లాంటి రోజువారీ కార్యక్రమాలను ఆపరాదు. అందుకోసం ముందుగా ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపిల జీతభత్యాలను నిలిపివేసే పథకంతో ప్రారంభిస్తే మంచిది.

## కేరళను ఠారెత్తిస్తున్న ఎండలు

### గతంలో ఎప్పుడూ లేనంతగా ఉష్ణోగ్రతలు

### స్వీయ నిర్బంధంతో ఇంట్లోనే ఉండాన్న సిఎం




**తిరువనంతపురం, ఏప్రిల్ 24, (రిపబ్లిక్ న్యూస్):-** కేరళలో గత రెండు రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. ఆ రాష్ట్రంలో అధిక తేమతో కూడిన త్రీవమైన వేడి కనీసం ఏప్రిల్ 27 వరకు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ డైరెక్టర్ నీతా కె. గోపాల్ వెల్లడించారు. వడదెబ్బకు ఇప్పటికే ఆ రాష్ట్రంలో ఒకరిద్దరు మరణించారు. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ కోవిడ్-19 తరహాలో ఇప్పుడు సెల్ఫ్ లాక్ డౌన్ అంటే స్వీయ నిర్బంధం పాటించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. తీవ్రమైన ఎండ తగిలే సమయాల్లో నేరుగా సూర్యరశ్మికి గురికాకుండా ఉండేందుకు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల మధ్య అనవసర ప్రయాణాలు, బహిరంగ ప్రదేశాలలో పనులు మానుకోవాలని ఆయన సలహా ఇచ్చారు. అలాగే ఈ సమయంలో బహిరింగ ప్రదేశాల్లో సమావేశాలు, క్రీడా కార్యక్రమాలు నిషేధించ నున్నట్లు వెల్లడించారు. వడగాలుల హెచ్చరికల దృష్ట్యా, పాలక్కాడ్, కొల్లాం, త్రిస్సూర్ జిల్లాల్లో పండుగల సమయంలో పగటిపూట జరిగే ఏనుగుల ఊరేగింపులు, బాణాసంచా ప్రదర్శనలను నివారించాలని లేదా వాయిదా వేయాలని ఆయన ఆదేశించారు. అలాగే ప్రయాణికులకు, ప్రజలకు తాగునీటిని అందించడానికి నీటి ట్యాంకులను, నీడ ఉన్న విశ్రాంతి ప్రదేశాలను ఏర్పాటు చేయాలని స్థానిక సంస్థలు, కుటుంబశ్రీ విభాగాలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారులకు ఆయన విజ్ఞప్తి చేశారు. అలసట లేదా వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే, వెంటనే వైద్య సహాయం తీసుకోవాలని ఆయన సూచించారు. ఎండదెబ్బకు ఎవరైనా ఇబ్బంది పడుతున్నట్లు కనిపిస్తే వెంటనే వారిని నీడ ఉన్న ప్రదేశానికి తరలించి వైద్య సహాయం అందించాలని విజయన్ కోరారు..

-----

## ఆకర్శణలేని ట్రంప్ గోల్డ్ కార్డు పథకం

### నాలుగు నెలల్లో ఒక్కటి మాత్రమే జారీ

### అమెరికా వాణిజ్య శాఖ మంత్రి హాళవార్డ్ లుట్నిక్




**వాషింగ్టన్,ఏ, ఏప్రిల్ 24, (రిపబ్లిక్ న్యూస్):-** అమెరికాలో శాశ్వత నివాసం కోరుకునే విదేశీయుల కోసం గతేడాది డిసెంబర్‌లో ట్రంప్ ప్రభుత్వం గోల్డ్ కార్డు స్కీమ్‌ను ప్రారంభించింది. కొత్త స్కీమ్ అమల్లోకి వచ్చి నాలుగు నెలలు కావొస్తున్నా ఇప్పటివరకూ కేవలం ఒక్కరికే గోల్డ్ కార్డు దక్కింది. ఈ విషయాన్ని అమెరికా వాణిజ్య శాఖ మంత్రి హాళవార్డ్ లుట్నిక్ పేర్కొన్నారు. అమెరికా కాంగ్రెస్ (చట్టసభలు) కమిటీకి ఈ వివరాలను గురువారం ఆయన వెల్లడించారు. గోల్డ్ కార్డు కావాలనుకునే విదేశీయులు 1 మిలియన్ డాలర్లు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. ప్రాసెసింగ్ ఫీజు అదనం. అయితే, ఈ స్కీమ్‌కు డిమాండ్ అద్భుతంగా ఉందని మొదట్లో లుట్నిక్ చెప్పుకొచ్చారు. ఏకంగా 1.3 బిలియన్ డాలర్ల విలువైన వాటిని జారీ చేశామని అప్పట్లో అన్నారు. ఇందుకు భిన్నంగా ఆయన కేవలం ఒక్క గోల్డ్ కార్డును మాత్రమే జారీ చేశామని తాజాగా పేర్కొనడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, వందల సంఖ్యలో గోల్డ్ కార్డు దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని లుట్నిక్ కాంగ్రెస్ కమిటీకి చెప్పారు. వీసా కోసం జనాలు క్యూకట్టారని కూడా లుట్నిక్ అన్నారు. అధికారులు ఈ మధ్యనే పూర్తి స్థాయి వ్యవస్థను ఏర్పాటు చేశారని, ఎలాంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారని కూడా చెప్పారు. ట్రంప్ ప్రభుత్వం ఈ పథకాన్ని అట్టహాసంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ పథకం కింద ఎంపికైన వారికి కేవలం ఐదేళ్లల్లోనే పౌరసత్వానికి దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం లభిస్తుంది.

## బెంగాల్‌లో జంగిల్ రాజ్ ఖేల్ ఖతం

**భారీ ఓటింగ్ బిజెపి అధికారానికి సూచిక**

**టిఎంసి పూర్తి మహిళా వ్యతిరేక పార్టీ**

**ప్రచారంలో ప్రధాని మోడీ విమర్శలు**

**కోల్‌కతా,, ఏప్రిల్ 24, (రిపబ్లిక్ న్యూస్):-**
పశ్చిమ బెంగాల్‌లో నమోదైన భారీ పోలింగ్.. రాష్ట్రంలో మమత ఆధ్వర్యంలోని టీఎంసీ జంగిల్ రాజ్ పాలనకు అంతం అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. బెంగాల్‌లోని డుమ్ డుమ్‌లో శుక్రవారం జరిగిన బీజేపీ ప్రచార సభలో మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడి టీఎంసీ ప్రభుత్వంపై కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమ బెంగాల్‌లో గురువారం జరిగిన తొలి దశ ఓటింగ్‌లో భారీ స్థాయిలో పోలింగ్ నమోదైన సంగతి తెలిసిందే. ఈ అంశంపై కూడా మోదీ మాట్లాడారు. తొలి దశ ఎన్నికల్లో రికార్డ్ స్థాయిలో పోలింగ్ నమోదైందంటే అది టీఎంసీ మహా జంగిల్ రాజ్ ప్రభుత్వానికి అంతం మొదలైనట్లే. రాష్ట్రంలో బీజేపీ కచ్చితంగా



అధికారంలోకి వస్తుంది. బీజేపీకి అండగా నిలుస్తున్న మహిళా ఓటర్లకు ధన్యవాదాలు. గురువారం నాడు బీజేపీకి లభించిన మద్దతు పార్టీ విజయ శంఖారావం పూరించినట్లే. బెంగాల్‌లో ఎక్కడ ప్రజాస్వామ్యాన్ని తన నిరంకుశత్వంతో టీఎంసీ అంతం చేసిందో, అక్కడే, మొదటి దశలోనే ప్రజలు ప్రజాస్వామ్య దేవాలయాన్ని నిర్మించడం ప్రారంభించారు. బీజేపీ అధికారంలోకి రాగానే ఆయుష్మాన్ భారత్ యోజన పథకాన్ని వర్తింపజేస్తాం. అర్హులైన వారికి ఐదు లక్షల వైద్యం అందిస్తాం. ప్రభుత్వం ఏర్పడ్డ తొలి క్యాబినెట్ మీటింగ్‌లోనే దీనిపై నిర్ణయం తీసుకుంటాం. టీఎంసీ మహిళా వ్యతిరేక పార్టీ. మహిళలు అభివృద్ధి చెందాలని టీఎంసీ కోరుకోవడం లేదు. మహిళల భద్రతే బీజేపీ మొదటి ప్రాధాన్యం. బెంగాల్ ఆడబిడ్డలు అత్యాచారానికి గురై న్యాయం కావాలని కోరితే.. ఆడబిడ్డలు బయటకు రాకూడదని టీఎంసీ ప్రభుత్వం చెబుతోంది. మహిళలు కలలు కనడాన్ని టీఎంసీ అంగీకరించదని వ్యాఖ్యానించారు. ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో హత్యాచారానికి గురైన బాధిత యువతి తల్లి రత్న దేవ్‌నాథ్‌ను ప్రధాని మోదీ కలిశారు. ఆమెను బీజేపీ ఈ ఎన్నికల్లో తన పార్టీ తరఫున పానిహాటి నుంచి బరిలోకి దింపింది. ఈ అంశంపై మోదీ స్పందించారు. రత్న దేవ్‌నాథ్.. తన కూతురును కష్టపడి డాక్టర్ చేసింది. కానీ, టీఎంసీ ప్రభుత్వం ఆమె కూతురును తీసుకెళ్లింది. మేం ఆమె తల్లిని మా అభ్యర్థిగా నిలబెట్టాం అని మోదీ అన్నారు.

## రాష్ట్రంలో 706 పురాతన ఆలయాల పునర్నిర్మాణం

### రూ.800 కోట్లకు పైగా నిధులు కేటాయించాం -మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడి

**నెల్లూరు,, ఏప్రిల్ 24, (రిపబ్లిక్ న్యూస్):-** రాష్ట్రంలో 706 పురాతన ఆలయాల పునర్నిర్మాణానికి రూ.800 కోట్లకు పైగా నిధులు కేటాయించామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. శుక్రవారం కృష్ణపట్నంలోని శ్రీ సిద్దేశ్వర స్వామి ప్రాచీన దేవాలయ పునరుద్ధరణకు మంత్రి శంకుస్థాపన చేశారు. నిపుణుల బృందంతో కలసి ఆలయాన్ని మంత్రి ఆనం, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రాబోయే రెండేళ్లలో రూ.750 కోట్లు కేటాయించి భజన మందిరాల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. గోదావరి పరిసర ప్రాంతాల్లో ఉన్న 43 ఆలయాలకు కూటమి ప్రభుత్వం రూ.52 కోట్లు వెచ్చించిందని మంత్రి వెల్లడించారు. ఆలయాల పునర్నిర్మాణం అపూర్వమైన ఘట్టమని అభివర్ణించారు. కూటమి ప్రభుత్వం హిందూ జనోద్ధరణకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఆలయాల విశిష్టతను కాపాడటంలో కూటమి ప్రభుత్వం దేశంలోనే మొదటి స్థానంలో ఉందని



తెలిపారు. గత ప్రభుత్వంలో దీపారాధనకు కూడా ఆలయాలు నోచుకోక పోవడం బాధాకరమన్నారు. 10, 11 శతాబ్దాల కిందట గండగోపాలపురంగా పిలువబడ్డ ఈ ప్రాంతంలో సిద్ధేశ్వర ఆలయాన్ని నిర్మించారని తెలిపారు. ఆలయాల పునర్నిర్మాణం త్వరతిగతిన జరగాలని ఆదేశించినట్లు చెప్పారు. ఆలయాల పునర్నిర్మాణం కోసం శ్రమిస్తున్న కేంద్ర పురావస్తు శాఖ అధికారులను కూటమి ప్రభుత్వం అభినందిస్తోందని మంత్రి తెలిపారు. బ్యాంకుల్లో ఉన్న ఆలయాల ఫిక్సిడ్ డిపాజిట్లను ఎట్టి పరిస్థితుల్లో ఖర్చు చేయవద్దని.. ఫిక్సిడ్ డిపాజిట్ల నుంచి వచ్చే ఆదాయాలను మాత్రమే వినియోగించవచ్చని ఆనం సూచించారు. ఆలయ కమిటీలు, బోర్డు మెంబర్ల నియామకంలో గత ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించిందని మండిపడ్డారు. చట్టాలను గౌరవించే నాయకుడు సీఎం చంద్రబాబు అని ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. శతాబ్దాల కాలంనాటి సిద్ధేశ్వర ఆలయం పునర్నిర్మాణం జరగడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. ఆలయాన్ని కూల్చకుండా పునర్నిర్మాణం చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. ఆలయాన్ని ప్రాచీన పద్ధతుల్లోనే పునర్నిర్మాణం చేస్తున్నారని వివరించారు. ఆలయానికి కావల్సిన నిధులు సిద్ధంగా ఉన్నాయని... దాతలు కూడా సిద్ధంగా ఉన్నట్లు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు.

## జులైలో మళ్లీ రాజకీయాల్లోకి వస్తున్నా

### : ఈడీ సోదాల అనంతరం విజయసాయి సంచలన ప్రకటన

**, ఏప్రిల్ 24, (రిపబ్లిక్ న్యూస్):-**
మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి ఏపీ రాజకీయాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. వచ్చే జులై నెల నుంచి తాను మళ్లీ క్రియాశీల రాజకీయాల్లోకి వస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ మద్యం కేసులో భాగంగా తన నివాసంలో ఈడీ సోదాలు ముగిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.
రాజకీయాల్లోకి పునరాగమనం చేయడమే కాకుండా, త్వరలోనే మీడియా రంగంలోకి కూడా అడుగుపెడుతున్నట్లు విజయసాయి రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన వైసీపీపై విమర్శలు చేశారు. గత ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పారని వ్యాఖ్యానించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రంలో మరో కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భవించాల్సిన అవసరం ఉందని అన్నారు. అంతకుముందు తన నివాసంలో జరిగిన ఈడీ సోదాలపై ఆయన స్పందించారు. అధికారుల సోదాల్లో ఎలాంటి ఆధారాలు లభించలేదని, తన వద్ద ఏమీ దొరకలేదని



విజయసాయి రెడ్డి స్పష్టం చేశారు. అయితే, ఈడీ తనను విచారణకు పిలిచే అవకాశం ఉందని అన్నారు.

# అధికారి అహంకారానికి

# దళిత కార్మికుడి బలి



మృతుడు సురేష్

- ఆది నుండి ఉన్నతాధికారి తీరుతో మున్సిపాలిటీ సిబ్బందికి కష్టాలు
- ఉన్నతాధికారి ఇంట్లో మృతుడు సురేష్ కు వేధింపులు
- కార్మికుడు సురేష్ మృతితో పోరాటాలకు సిద్ధమవుతున్న కార్మిక సంఘాలు
- దళిత కార్మికుడు సురేష్ కుటుంబానికి మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ జిల్లా కలెక్టర్ న్యాయం చేసేనా?
- ఉన్నతాధికారి ఇంట్లో సురేష్ కు బుధవారం రాత్రి ఆ గంటలో ఏం జరిగింది?

**అమరావతి ఏప్రిల్ 24( రిపబ్లిక్ న్యూస్) :**

100 సంవత్సరాలకు పైగా చరిత్ర ఉన్న నంద్యాల మున్సిపాలిటీలో గత ఎనిమిది నెలలు క్రితం ఒక ఉన్నత అధికారి బాధ్యతలు చేపట్టిన తర్వాత మున్సిపాలిటీలో ఎన్నడూ జరగనంత సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి ఆది నుండి బాధ్యతలు చేపట్టిన ఉన్నతాధికారికి అహంకారంతో సిబ్బందిని చిన్న చూపు చూడడం, విధుల పేరుతో దూషించటం వంటి సంఘటనలు కోకోల్లలుగా జరిగాయి కొందరు సిబ్బంది ఈ అధికారి సూటి పోటీ మాటలు తట్టుకోలేక ఆయా విధుల నుండి వెళ్లిపోయి స్వామి దేవుడా అని బయటపడడం జరిగింది. దీనికి ఉదాహరణ గత పది సంవత్సరములుగా ఐదు మంది ఉన్నతాధికారుల వద్ద డ్రైవర్గా విధులు చేసిన వ్యక్తి ఈ ఉన్నతాధికారి వేధింపులను తట్టుకోలేక డ్రైవర్గా విధుల నుండి స్వయంగా పక్కకు తప్పుకోవడం ఈయన అహంకారానికి నిదర్శనం ప్రస్తుతం స్వామి దేవుడా అంటూ శానిటరీ విభాగంలో బతుకు జీవుడా అంటూ ట్రాక్టర్ను నడుపుకుంటూ జీవనం సాగిస్తూ ఉండటం విశేషం ఈ ఉన్నతాధికారి జులుమును చూసుకొని మరికొందరు ఆయా విభాగాలలో అధికారులు కార్మికులను నోటికి వచ్చినట్టు బూతులు తిట్టడం వేధించడంతో మున్సిపాలిటీలో గతంలో ఎప్పుడూ లేని విధంగా కార్మికులు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడడం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశం అయింది అయినా కానీ ఈ ఉన్నత అధికారి తన అహంకారాన్ని ఏమాత్రం తగ్గించుకోపోగా మరింత పదును పెట్టి కార్మికుడి సురేష్ మరణానికి కారణమైనట్లు మున్సిపాలిటీలో చర్చించుకుంటున్నారు మృతి చెందిన దళిత సంఘానికి చెందిన కార్మికుడు సురేష్ సుమారుగా 15 సంవత్సరాల నుండి మున్సిపాలిటీలో కాంటాక్ట్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నారు ఇప్పటివరకు దాదాపు పది సంవత్సరాల నుండి 5 మంది ఉన్నతాధికారుల ఇంటి వద్ద విధులు నిర్వహించాడు కానీ ఈ ఉన్నత అధికారి టార్చర్ ను భరించలేనంటూ సాటి ఉద్యోగుల వద్ద గత కొద్ది నెలలుగా మొరపెట్టుకుంటున్నట్లు వారు బాధపడుతున్నారు అప్పుడే కార్మికులు సురేష్ కు తాము మద్దతు పలికి ఆ విధుల నుండి తప్పించి వేరే విభాగానికి మార్పించి ఉంటే ఇప్పుడు సురేష్ మృతి చెందే వాడు కాదంటూ వారు కన్నీళ్ల పర్యంతమవుతున్నారు ఇప్పుడు కార్మికుడు సురేష్ మృతి చెందడంతో కుమార్తె కుమారుడు భార్య వారి కుటుంబం పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు మృతి చెందిన కార్మికుడు సురేష్ కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు కార్మిక సంఘాలు అందరం కలిసి పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిస్తున్నారు ఇప్పటికైనా స్పెషల్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ ఈ ఉన్నత అధికారిపై చర్యలు తీసుకుని మృతి చెందిన సురేష్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతున్నారు

## సురేష్ కు ఆ గంటలో అసలు ఏం జరిగింది

బుధవారం రాత్రి ఏడు గంటలకు యధావిధిగా ఇంటి వద్ద ఈ ఉన్నతాధికారి టార్చర్ ను ఎప్పుడు నాకు తగ్గుతుందో అని కుటుంబ సభ్యులతో బాధపడుతూ వెళ్లినట్లు సమాచారం ఏడున్నర గంటలకు కాంతి నగర్ లోని ఉన్నతాధికారి ఇంటికి చేరుకున్నాడు అనంతరం 9 గంటల నుండి కుటుంబ సభ్యులు ఫోన్ చేస్తుంటే లిఫ్ట్ చేయడం లేదు ఆ తర్వాత మీ భర్త సురేష్ కింద పడిపోయాడు ఉదయానంద ఆసుపత్రిలో చేర్పించాము చెప్పారు హుటాహుటిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి వెళ్లడంతో ఆసుపత్రి సిబ్బంది మెదుడు లో రక్తస్రావం జరుగుతుంది వెంటనే డబ్బులు కట్టండి చికిత్స చేస్తాము అని చెప్పారు లేదంటే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొని వెళ్ళమని సూచించారు కుటుంబ సభ్యుల వద్ద చికిత్సకు డబ్బులు లేకపోవడంతో హుటాహుటిన కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు అనంతరం మెరుగైన చికిత్స కు అమీలియా హాస్పిటల్ కు తరలించిన ఫలితం లేక శుక్రవారం రాత్రి మృతి చెందడం జరిగింది అసలు బుధవారం రాత్రి 7:30 నుండి ఉదయానంద ఆసుపత్రి చేరుకునే సమయంలో ఉన్నతాధికారి ఇంట్లో ఏం జరిగింది అనేది మిస్టరీగా మారింది కార్మికుడు సురేష్ మృతి పై పోలీసులు లోతుగా విచారించి నిజాన్ని వెలికి తీయాలని మున్సిపాలిటీ కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి






# పెట్రోల్, డీజిల్ కొరత రోజు రోజుకి

# సోషల్ మీడియాలో వైరల్

- నంద్యాల పట్టణం దాటితే ఎటువంటి ఇంధన కొరత లేదు
- నంద్యాల పట్టణంలో మాత్రమే ఇంధనాల కృత్రిమ కొరత
- సామాన్య ద్విచక్ర, త్రీచక్ర వాహనాల వియోగదారులకు తప్పని క్యూ
- 10, 20, లీటర్ల క్యాన్లకు ఎక్కువగా చేరుతున్న పెట్రోల్, డీజిల్
- ఫోన్ పే ఉంటే క్యాష్ అంటారు.. క్యాష్ ఉంటే ఆన్లైన్ ట్రాన్సక్షన్ చేయండి అంటారు -ద్విచక్ర వాహనదారుడు
- సోషల్ మీడియాలో వచ్చే అవాస్తవాలను నమ్మకండి - నంద్యాల ఆర్డీవో విశ్వనాథ్





**నంద్యాల చీఫ్ క్రైం బ్యూరో, ఏప్రిల్ 24, (రిపబ్లిక్ న్యూస్):** సోషల్ మీడియాలో ప్రస్తుతం నంద్యాల పట్టణం, పరిసర గ్రామీణ ప్రాంతాల్లో పెట్రోల్, డీజిల్ కొరత గురించి అనేక వార్తలు వైరల్ అవుతున్నాయి. గత కొన్ని రోజులుగా ఫేస్‌బుక్, వాట్సాప్, ఎక్స్ (ట్విట్టర్), ఇన్స్టాగ్రామ్ వంటి వేదికల్లో "పెట్రోల్ బంకులు మూతపడబోతున్నాయి" లేదా "స్టాక్ అయిపోయింది" అనే వార్తలు విపరీతంగా షేర్ అవుతున్నాయి. అందులో నంద్యాల పట్టణంలో ఫిల్లింగ్ స్టేషన్ల వద్ద పెట్రోల్ ఉంటే డీజిల్ ఉండదు. డీజిల్ ఉంటే పెట్రోల్ ఉందని పరిస్థితి ఏర్పడింది. దీనివల్ల సామాన్య ప్రజల్లో ఆందోళన మొదలై, బంకుల వద్ద భారీ క్యూలు కనిపిస్తున్నాయి. సామాన్యున ద్విచక్ర, త్రీచక్ర వాహనాల వియోగదారులకు తప్పక ఫిల్లింగ్ స్టేషన్ల వద్ద గంటలు గంటలు పడిగాపులు కాయల్సివస్తుంది.

### నంద్యాల పట్టణం దాటితే ఎటువంటి ఇంధన కొరత లేదు

**నంద్యాల పట్టణంలో మాత్రమే ఇంధనాల కృత్రిమ కొరత**

పాణ్యం నుండి తెలంగాణ వెళ్ళే మార్గాలలో పెట్రోల్, డీజిల్ అందుబాటులోనే ఉన్నాయని ఎలాంటి ఇబ్బంది లేదని సమాచారం. నంద్యాల పట్టణం దాటితే ఎటువంటి ఇంధన కొరత లేదు. స్థానిక పట్టణంలో మాత్రమే పెట్రోల్, డీజిల్ నిల్వలు అయిపోయి బంకులు మూతపడుతాయని సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వార్తల వదంతుల వలన భయంతో ప్రజలు ట్యాంకులు ఫుల్ చేయించుకోవడం వల్ల ఒక్కసారిగా డిమాండ్ పెరిగి, తాత్కాలికంగా బంకుల్లో స్టాక్ అయిపోవచ్చు. ఇందువలన నంద్యాల పట్టణంలో పెట్రోల్, డీజిల్ కృత్రిమ కొరతకు దారితీసింది. ఎవరికి తగిన ఇంధనం వరకు మాత్రమే వారు తెచ్చుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవు. వాహనదారులు క్యూలు కట్టి కావలసిన దానికన్నా ఇంధనం ఎక్కువగా తెచ్చుకోవడంతో రోడ్ల పై వాహనాలు నిలిచి పట్టణంలో ట్రాఫిక్ పెరిగిపోవటంతో ఫిల్లింగ్ స్టేషన్ల వద్ద పోలీసు విధులు నిర్వహించవలసిన పరిస్థితి ఏర్పడింది.

### 10, 20, లీటర్ల క్యాన్లకు ఎక్కువగా చేరుతున్న పెట్రోల్, డీజిల్



నంద్యాల పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో ఫిల్లింగ్ స్టేషన్ల వద్ద 10, 20, లీటర్ల క్యాన్లకు పెట్రోల్, డీజిల్ ఎక్కువగా అందిస్తున్నారని సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫిల్లింగ్ స్టేషన్ వారు కూడా కావాలనే ఇంధనాలను ఎక్కువ రేటుకు అమ్మకాలు జరుపుతున్నారని సామాన్య ప్రజలు వాపోతున్నారు.

### ఫోన్ పే ఉంటే క్యాష్ అంటారు.. క్యాష్ ఉంటే ఆన్లైన్ ట్రాన్సక్షన్ చేయండి అంటారు -ద్విచక్ర వాహనదారుడు



నంద్యాల నూనెపల్లె వద్ద శుక్రవారం ఓ ఫిల్లింగ్ స్టేషన్ వద్ద ఇంధనం కోసం వెళ్లాను. ఫోన్ పే చేస్తా అనగా కాదు డబ్బులు మాత్రమే కావాలని ఫిల్లింగ్ స్టేషన్ సిబ్బంది చెప్పారు. ఫోన్ పే ఉంటే క్యాష్ అంటారు.. క్యాష్ ఉంటే ఆన్లైన్ ట్రాన్సక్షన్ చేయండి అంటారు. అని ప్రశ్నించగా.. మాతో వాదించి సమయం వృధా అవుతుందని సిబ్బంది సమాధానం ఇచ్చారు.

### సోషల్ మీడియాలో వచ్చే అవాస్తవాలను నమ్మకండి

**పెట్రోల్, డీజిల్ ట్యాంక్ అందుబాటులోకి రానున్నాయి -నంద్యాల ఆర్డీవో విశ్వనాథ్**



పెట్రోల్, డీజిల్ కొరత అని రోజు రోజుకి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న అవాస్తవాలను నమ్మకండి. పెట్రోల్, డీజిల్ ట్యాంకులు అందుబాటులోకి రానున్నాయి. వాహన చోదకులు ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదు. సాధ్యమైనంత సమయంలో తగు చర్యలు తీసుకొని పెట్రోల్, డీజిల్ కొరతను నివారిస్తాం.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com